

నేటి దర్శిని తెలుగు దిన పత్రిక లో
ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365

WWW.NETIDARSHINI.COM

# నేటి దర్శిని

RNI NO: TGTEL/25/A0471

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...

రంగారెడ్డి మంగళవారం 30-06-2026 సంపుటి: 02 సంచిక : 60 వెల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని

Ranga Reddy Tuesday, 30-06-2026 Volume :02 Issue: 60 RS: 2 Pages:08 Editor : Katta HimaPavani

రిపోర్టర్లు కావలెను



జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి దర్శిని ఆహ్వానం పలుకుతుంది. తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

Contact Number
9059328777

# హరీష్ రావుకు మెంటల్ బ్యాలెన్స్ తప్పింది



ప్రజలు ఐదేళ్లకు తీర్పునిచ్చారు...
ఎందుకు అసెంబ్లీని రద్దు చేయాలి

- ప్రతి ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు ప్రజలు శిక్ష వేస్తూనే ఉన్నారు
- బిజేపీది ఆశకాదు.. అత్యాశ
- రైతు భరోసా నిధులు వారంరోజుల్లో జమ చేస్తాం
- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్ (జూన్ 29) (నేటి దర్శిని)
బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతున్న తీరుచూస్తుంటే ఆయనకు మెంటల్ బ్యాలెన్స్ తప్పిందనే అనుమానం కలుగుతోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. సోమవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మంత్రి మాట్లాడుతూ దమ్ముంటే అసెంబ్లీని రద్దు చేయాలన్న హరీష్ రావు

-మిగతా 2 లో




## ప్రపంచ దేశాలు అతలాకుతలం

- 17 ఏండ్లలో అత్యంత బలహీన నైరుతి ఆరంభమిదే
- సాధారణం కంటే 42% తక్కువగా జూన్ వర్షపాతం
- 166 ప్రధాన రిజర్వాయర్లలో 25 శాతమే నీటి నిల్వ!
- వేడెక్కుతున్న అట్లాంటిక్.. పసిఫిక్‌లో ఎల్‌నినో
- ఐరోపా, ఉత్తర అమెరికాలో అధిక ఉష్ణోగ్రతలు
- వర్షాభావంతో భారత ఉప ఖండంలో కరువు!

న్యూఢిల్లీ,
రెండు మహాసముద్రాలు పలు ప్రపంచ దేశాల్లో కోట్ల మందిని అతలాకుతలం చేస్తున్నాయి. ఒకటి అట్లాంటిక్ మహా సముద్రం కాగా, రెండోది పసిఫిక్ మహాసముద్రం. కొన్ని వేల కిలోమీటర్ల దూరం ఉన్న ఈ రెండు మహాసముద్రాలు వాతావరణంలో మార్పులకు కారణమవుతున్నాయి. వేడెక్కుతున్న అట్లాంటిక్ మహాసముద్రం కారణంగా ఐరోపా, ఉత్తర అమెరికా ఖండాల్లో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతన్నాయి. మరోవైపు పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడుతున్న ఎల్ నినో కారణంగా భారతదేశంలో

-మిగతా 2 లో




## ఉద్యోగులకు తీపికబురు

- మరో రూ.2 వేల కోట్ల బకాయిలు విడుదల
- ఉప ముఖ్యమంత్రి ఆదేశాలతో నిధులు విడుదల
- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం

హైదరాబాద్ (జూన్ 29) (నేటి దర్శిని)
రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పట్ల ఉన్న చిత్తశుద్ధిని రాష్ట్ర ప్రభుత్వం మరోసారి చాటుకుంది. ఉద్యోగులకు తీపికబురు అందించింది. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ఉద్యోగులకు ఇచ్చిన హామీని నెరవేర్చింది. బకాయిల చెల్లింపు ప్రక్రియను వేగవంతం చేసింది. ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా అడుగులు వేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కల ఆదేశాల మేరకు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా సోమవారం రూ.రెండు వేల కోట్ల నిధులను విడుదల చేశారు. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ఉద్యోగులు,

-మిగతా 2 లో

## ఫ్రాన్స్‌లో భానుడి భగభగ



- వెయ్యి మందికిపైగా బలి
- విలవిల్లాడుతున్న జనజీవనం
- వృద్ధులే లక్ష్యంగా వడగాల్పుల దాడి
- కిక్కిరిసిన ఆస్పత్రులు, శ్మశానవాటికలు:
- అత్యంత దారుణంగా సైప్రస్ పరిస్థితి

2

## అఫ్గానిస్థాన్‌పై పాక్ భీకర దాడి



- చిన్నారులు సహా 35 మంది మృతి
- సహాయక సిబ్బందిని లక్ష్యంగా చేసుకున్న పాక్ సైన్యం
- ప్రతీకార దాడులంటూ పాకిస్థాన్ వాదన
- పిరికిపంద చర్యగా అభివర్ణించిన జబిహుల్లా ముజాహిద్
- అంతర్జాతీయ శాంతిదూతగా నటిస్తూ పొరుగు దేశంపై దాడులు
- పాకిస్థాన్ ద్వంద్వ వైఖరిపై విమర్శలు

2



## దేశం గర్వించే రాజధాని నగరంగా అమరావతి

- హైదరాబాద్ ప్లస్‌గా అమరావతి నిర్మాణం జరగాలి
- రాజధాని నిర్మాణ పనుల్లో మరింత వేగం పెంచాలి
- ప్రారంభానికి ప్రధాని మోడీకి ఆహ్వానం
- నిర్మాణ సంస్థలతో సీఎం చంద్రబాబు సమీక్ష

అమరావతి, (జూన్ 29) (నేటి దర్శిని)
యావత్ దేశం గర్వించే రాజధాని నగరంగా అమరావతిని నిర్మిస్తున్నామని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. హైదరాబాద్ ప్లస్‌గా అమరావతి నిర్మాణం జరగాలని అన్నారు. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ నగర నిర్మాణంలో కాంట్రాక్టు సంస్థలు కూడా భాగస్వాములు కావాలని సీఎం పిలుపునిచ్చారు. రాజధాని నిర్మాణ పనుల్లో మరింత వేగం పెంచాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. అమరావతిలో నిర్మాణ పనుల పురోగతిపై సచివాలయంలో కాంట్రాక్టు సంస్థలతో సీఎం సమిక్ష నిర్వహించారు. నిర్దేశిత గడువు కంటే ముందే నిర్మాణ పనులు పూర్తి చేయాలని సూచనలు ఇచ్చారు. ప్రస్తుతం రూ.50,999 కోట్ల విలువైన పనులు కాంట్రాక్టు సంస్థలకు అప్పగించామని అధికారులు వివరించారు. హౌసింగ్, ట్రంక్ ఇన్ ఫ్రా, ఎల్పీఎస్ ఇన్ ఫ్రా, సహా అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయ టవర్ల లాంటి ఐకానిక్ భవనాల నిర్మాణ ప్రాజెక్టులు వేగంగా

-మిగతా 2 లో

## రైతు ఆశీర్వాద సభ వాయిదా

వాతావరణ పరిస్థితుల దృష్ట్యా నిర్ణయం

- వాయిదా పడినా ఆగని 'రైతు భరోసా'
- మంగళవారం నుంచి నిధుల విడుదల
- తొమ్మిది రోజుల్లో రూ.9 వేల కోట్లు: రైతుల ఖాతాల్లోకి జమ
- జులై 6, 7 లేదా 8న ముగింపు వేడుకలు నిర్వహించేందుకు సన్నాహాలు
- సభా ప్రాంగణంలో బురద కారణంగా మార్పు
- రుణమాఫీ, రైతు భరోసాపై విపక్షాల అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టిన మంత్రి తుమ్మల

ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి (జూన్ 29) (నేటి దర్శిని)
ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న రైతు సంక్షేమ, ప్రజా కార్యక్రమాలను మెచ్చి వరణుడు కరుణించాడని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. వర్షాల నేపథ్యంలో సీఎం ఖమ్మం పర్యటన వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. రైతు భరోసా పంపిణీ అనంతరం రైతు ఆశీర్వాద సభ ఉంటుందన్నారు. చింతకాని మండలం జగన్నాథపురంలో రైతు ఆశీర్వాద సభా ప్రాంగణాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌తో కలిసి డిప్యూటీ సీఎం సోమవారం పరిశీలించారు. అనంతరం ఏర్పాటు

-మిగతా 2 లో





## పరస్పర దాడులు నిలిపివేత

- అంగీకారానికి వచ్చిన ఇరాన్, అమెరికా
- హోర్ముజ్‌పై నేడు దోహాలో సంప్రదింపులు

2



## జులై 4న ఖమేనీ అంత్యక్రియలు

- హాజరు కానున్న కేంద్రమంత్రి


2



2

## 2028 నుంచి పెట్రోల్ బైకుల రిజిస్ట్రేషన్ బంద్

- రూ.30 లక్షల లోపు ఈ-కార్లకు పన్ను రాయితీ
- విద్యుత్తు వాహనాల పాలసీకి ఢిల్లీ సర్కార్ ఆమోదం



## వాహనదారులకు ఊరట

- సాధారణ స్థితికి చేరిన ఇంధన సరఫరా:
- మళ్లీ అందుబాటులోకి పూర్తిస్థాయి ఇంధనం
- ఇరాన్-అమెరికా చర్చలతో మెరుగుపడిన పరిస్థితి
- ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్‌పై తొలగిన ఆంక్షలు:


2

జూలై 1 ను
పెట్రోల్, డీజిల్ ఆంక్షల ఎత్తివేత

# ఫ్రాన్స్‌లో భానుడి భగభగ

**- వెయ్యి మందికిపైగా బలి**
**-విలవిల్లాడుతున్న జనజీవనం**
**- వృద్ధులే లక్ష్యంగా వడగాల్పుల దాడి**
**- కిక్కిరిసిన ఆస్పత్రులు, శ్మశానవాటికలు:**
**- అత్యంత దారుణంగా సైప్రస్ పరిస్థితి**

పారిస్



యూరోప్‌లో సమ్మర్ సెగ పుట్టిస్తోంది. వేడి తట్టుకోలేక.. జనం విలవిలలాడుతున్నారు. అధిక ఉష్ణోగ్రతల వల్ల ఫ్రాన్స్‌లో మృతుల సంఖ్య భారీగా నమోదు అవుతోంది. సాధారణం కన్నా ఈసారి వెయ్యి మంది అధికంగా ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు చెప్పారు. గడిచిన రెండు దశాబ్ధాలతో పోలిస్తే, ఈసారి ఎండ తీవ్రత మరీ ఎక్కువగా నమోదు అయినట్లు తెలుస్తోంది. ఫ్రాన్స్‌లోని అనేక ప్రాంతాల్లో గత కొన్ని రోజులుగా 40 డిగ్రీల కన్నా ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. దీంతో మంగళవారం ఆ దేశంలో అత్యంత వేడి దినంగా నమోదు అయ్యింది. 2003 తర్వాత భారీ స్థాయిలో గరిష్ట ఉష్ణోగ్రతులు నమోదు అవుతున్నాయి.జూన్ 24వ తేదీ నుంచి అధికంగా సుమారు వెయ్యి మందికిపైగా వేడి వల్ల మృతిచెందినట్లు నేషనల్ పబ్లిక్ హెల్త్ ఏజెన్సీ పేర్కొన్నది. అయితే బాధితుల్లో 85 శాతం మంది 65 ఏళ్లు దాటినవారే ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు చెప్పాయి. ఐలీ డీ ఫ్రాన్స్ ప్రాంతంలో మృతుల సంఖ్య 40 శాతం పెరిగినట్లు తెలిసింది. నార్మాండీ, బ్రిట్టనీ, సెంటర్ వాల్ డీ లోయిరి, పేస్ డీ లా లోయిరి, నోవెల్లి అక్వెయింటిని ప్రాంతాలు కూడా తీవ్ర హీట్‌వేవ్‌కు గురవుతున్నాయి. పారిస్‌లో అనేక ఈవెంట్లను రద్దు చేశారు. వార్షిక ప్రైడ్ మార్చ్ కూడా రద్దు అయ్యింది. ఆస్పత్రులు, శ్మశానవాటికలు కిక్కిరిసిపోతున్నట్లు అధికారులు చెప్పారు. పబ్లిక్ సేవలన్నీ అధిక భారంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. సమ్మర్ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదని విపక్షాలు విమర్శిస్తున్నాయి. ఆదివారం జర్మనీలో 41.7 డిగ్రీలు, చెక్ రిపబ్లిక్‌లో 41.1 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. వేసవి కాలంలో ఈ సారి అనేక యురోప్ దేశాల్లో తీవ్ర నీటి ఎద్దడి ఉన్నట్లు యురోపియన్ యూనియన్ తెలిపింది. సైప్రస్‌లో అత్యధికంగా 92 శాతం నీటి కొరత ఉన్నట్లు పేర్కొన్నది. మాల్టాలో 66 శాతం, టర్కీ.. గ్రీస్, రొమేనియా, పోర్చుగల్ దేశాల్లో 30 శాతంపైనే నీటి సమస్య ఉన్నట్లు తెలుస్తోంది.

# పరస్పర దాడులు నిలిపివేత

**అంగీకారానికి వచ్చిన ఇరాన్, అమెరికా**
**హోర్ముజ్‌పై నేడు దోహాలో సంప్రదింపులు**

-- జనరల్ డెస్క్



పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు సడలి సాధారణ పరిస్థితులు నెలకొనే అవకాశాలు కన్పిస్తున్నాయి. పరస్పర దాడులను నిలిపివేసేందుకు ఇరాన్, అమెరికా అంగీకరించాయి. హోర్ముజ్ జలసంధిపై ఏర్పడిన వివాదాన్ని పరిష్కరించుకోవడానికి తిరిగి సంప్రదింపులు ప్రారంభించాలని నిర్ణయించాయి. దీంతో తాత్కాలిక శాంతి ఒడంబడిక సజీవంగానే ఉంటుందన్న ఆశాభావం వ ?యక్తమవుతోంది. 'ఎంఓయూలోని అన్ని అంశాల పైన సాంకేతిక చర్చలు కొనసాగుతాయి. ఇరు పక్షాలు దాడులకు స్వస్తి చెబుతాయి. హోర్ముజ్‌లో నౌకలు స్వేచ్ఛగా ప్రయాణించవచ్చు' అని ఓ అమెరికా అధికారి తెలిపారు. ఈ నెల 17న 14 సూత్రాల అవగాహనా ఒప్పందం (ఎంఓయూ)పై ఇరాన్, అమెరికా సంతకాలు చేసిన విషయం తెలిసిందే. ఈ ఒప్పందం ప్రకారమే హోర్ముజ్‌ను వాణిజ్య నౌకల రాకపోకలకు తెరిచారు. కాగా ఇరు పక్షాల మధ్య మంగళవారం ఖతార్‌లో చర్చలు ప్రారంభం అవుతాయని ఆక్సియాస్ వార్తా సంస్థ తెలియజేసింది. జలసంధిలో ప్రయాణిస్తున్న ఓ వాణిజ్య నౌకపై గురువారం ఇరాన్ దాడి జరిపిన నేపథ్యంలో మధ్యప్రాచ్యంలో తిరిగి ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఎంఓయూ కింద కుదుర్చుకున్న కాల్పుల విరమణను ఇరు దేశాలు బేఖాతరు చేసి దాడులు, ప్రతిదాడులకు దిగాయి. ఆదివారం ఉదయం కువైట్, అమెరికా స్థావరాలపై ఇరాన్ సేనలు క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడ్డాయి. యుద్ధాన్ని ముగించేందుకు కుదుర్చుకున్న ఒప్పందాన్ని గౌరవించని పక్షంలో ఇరాన్ అనేదే ఉండదని అంతకుముందు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలు జారీ చేశారు. ఇరు దేశాల మధ్య తాజాగా హింస చోటుచేసుకున్నప్పటికీ ఇరాన్, అమెరికా అధికారులు మాత్రం నేడు దోహాలో సమావేశమవుతారు. ఎంఓయూను సజీవంగా ఉంచేందుకు, మరో సైనిక చర్య జరగకుండా నివారించేందుకు ప్రయత్నిస్తారు.

# జులై 4న ఖమేనీ అంత్యక్రియలు

**హాజరు కానున్న కేంద్రమంత్రి**

న్యూఢిల్లీ,



ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలకు భారత్ తరఫున విదేశాంగ శాఖ సహాయమంత్రి పబిత్ర మార్గరీటా హాజరుకానున్నట్టు సమాచారం. మంత్రి పబిత్రతో పాటు బిహార్ గవర్నర్ సయ్యద్ అతా హస్నైన్ కూడా వెళ్లనున్నట్టు తెలుస్తోంది. అయతొల్లా ఖమేనీ అంత్యక్రియలకు రావాలని ప్రధాని మోదీని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ఇటీవల ఆహ్వానించారు. ఈ నేపథ్యంలో భారత్ తరఫున కేంద్ర మంత్రి, బిహార్ గవర్నర్ ఇరాన్‌కు వెళ్లనున్నట్టు తెలుస్తోంది. అయతొల్లా జన్మస్థలమైన మష్హాద్ నగరంలోనే జులై 4న ఆయన అంత్యక్రియలను నిర్వహించనున్నారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్‌లు ఫిబ్రవరి 28న దాడులు ప్రారంభించిన విషయం తెలిసిందే. తొలి రోజు జరిగిన దాడిలోనే ఖమేనీ కన్నుమూశారు. దాదాపు 36 ఏళ్ల పాటు ఆయన ఇరాన్‌ను ముందుండి నడిపించారు. ఖమేనీ స్మృత్యర్థం కోమ్ నగరంలో కూడా ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని స్థానిక మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఖమేనీ అంత్యక్రియలపై తొలి నుంచీ కొంత సందిగ్ధత నెలకొంది. జూన్‌లో అంత్యక్రియలు పూర్తవుతాయని మొదట్లో వార్తలు వెలువడ్డాయి. అయితే, జులైలో ఈ కార్యక్రమం జరుగుతుందని ప్రభుత్వ మీడియా ఇటీవల ధ్రువీకరించింది. అంత్యక్రియలకు దాదాపు 20 మిలియన్ల మంది హాజరుకానున్నట్టు ఇరాన్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. పాక్ ప్రధాని షహబాజ్ షరీఫ్ కూడా ఇరాన్‌కు వెళ్లే అవకాశం ఉంది. ఇక అయతొల్లా ఖమేనీ అనంతరం ఆయన కుమారుడు మొజ్తాబా ఖమేనీ ప్రస్తుతం ఇరాన్ సుప్రీం లీడర్‌గా ఉన్నారు. అయితే, ఆయన ఎక్కడున్నారనే దానిపై స్పష్టత లేదు. మొజ్తాబా ఆరోగ్యంపై కూడా పలు వార్తలు వెలువడ్డాయి. ఆయన కోమాలో ఉండే అవకాశం ఉందని సీనియర్ యూఎస్ అధికారులు పలుమార్లు తెలిపారు.

# ప్రపంచ దేశాలు అతలాకుతలం

మొదటి తరువాయి

నైరుతి రుతుపవనాలకు అవాంతరం ఏర్పడుతున్నది. దీంతో దేశంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొని ఇటీవలి కాలంలో ఎన్నడూ లేనట్టి కరువు పరిస్థితులకు దారితీస్తున్నది. దీంతో న్యూఢిల్లీ నుంచి న్యూయార్క్ వరకు విస్తరించిన ఈ అసాధారణ వాతావరణ పరిస్థితులకు ఈ రెండు మహాసముద్రాలు కారణమవుతున్నాయి.

**ఉష్ణ గుమ్మటాలు బలపడే చాన్స్**

వేడెక్కుతున్న అట్లాంటిక్ మహాసముద్రం కారణంగా గతంలో ఎన్నడూ లేని విధంగా ఐరోపా ఖండంలో వడగాలులు వీయడమే కాకుండా స్పెయిన్, పోర్చుగల్, ఇటలీ, ఫ్రాన్స్ దేశాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్‌ను దాటుతున్నాయి. ఈ వాతావరణ ధోరణి పశ్చిమ దిశగా విస్తరిస్తున్నదని, దీంతో ఉష్ణ గుమ్మటాలు బలపడి అమెరికాలో సైతం రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశమున్నదని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. నిరంతరం అధిక వాతావరణ పీడనం ఉండే ప్రాంతంలో భూ ఉపరితలం దగ్గర వేడి గాలులను బంధించినప్పుడు ఉష్ణగుమ్మటం ఏర్పడుతుందని వారు వివరించారు. ఆ సమయంలో దిగువకు వీచే గాలి సంకోచించి వేడెక్కుతుందని, అదే సమయంలో ఆకాశం నిర్మలంగా మారడంతో సూర్యరశ్మి నేలను దహించి వేస్తుందని తెలిపారు.

# అఫ్గానిస్థాన్‌పై పాక్ భీకర దాడి

**-చిన్నారులు సహా 35 మంది మృతి**
**-సహాయక సిబ్బందిని లక్ష్యంగా చేసుకున్న పాక్ సైన్యం**
**- ప్రతీకార దాడులంటూ పాకిస్థాన్ వాదన**
**- పిరికిపంద చర్యగా అభివర్ణించిన జబిహుల్లా ముజాహిద్**
**-అంతర్జాతీయ శాంతిదూతగా నటిస్తూ పొరుగు దేశంపై దాడులు**
**- పాకిస్థాన్ ద్వంద్వ వైఖరిపై విమర్శలు**



న్యూఢిల్లీ,

అంతర్జాతీయ వేదికపై అమెరికా, ఇరాన్ దేశాల మధ్య శాంతిని నెలకొల్పేందుకు మధ్యవర్తిత్వం వహిస్తూ ప్రశంసలు అందుకుంటున్న పాకిస్థాన్ తన సొంత సరిహద్దుల్లో మాత్రం అఫ్గానిస్థాన్ పై భీకర దాడులకు పాల్పడుతోంది. ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దుల్లో పాకిస్థాన్ సైన్యం తాజాగా జరిపిన వైమానిక దాడుల్లో కనీసం 35 మంది మరణించారు. మృతులంతా ఉగ్రవాదులేనని పాకిస్థాన్ వాదిస్తుండగా.. అమాయక పౌరులు, చిన్నారులు ప్రాణాలు కోల్పోయారని అఫ్గానిస్థాన్ ఆరోపిస్తున్నది. ఈ దాడుల్లో పాకిస్థాన్ సైన్యం అనుసరించిన వివాదాస్పద 'డబుల్ ట్యాప్ ' వ్యూహం తీవ్ర విమర్శలకు దారితీసింది.సైనిక పరిభాషలో 'డబుల్ ట్యాప్' అంటే ఒకే ప్రదేశంపై కొద్ది సమయం వ్యవధిలో రెండోసారి దాడి చేయడం. దీన్ని అత్యంత క్రూరమైన, అమానవీయమైన వ్యూహంగా పరిగణిస్తారు. ఎందుకంటే మొదటి దాడి తర్వాత సహాయక చర్యల కోసం వచ్చే సిబ్బంది, వైద్యులు, పౌరులను లక్ష్యంగా చేసుకుని రెండో దాడి జరుపుతారు. భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి 12:30 గంటలకు పాకిస్థాన్ వైమానిక దళం ఫైటర్ జెట్‌లు అఫ్గానిస్థాన్‌లోని పక్తికా, పక్తియా, కునార్ జిల్లాల్లోని ఇళ్లు, మసీదులపై బాంబులు వేశాయి. సరిగ్గా 25 నిమిషాల తర్వాత అంటే 12:55 గంటలకు శిథిలాల కింద చిక్కుకున్న మహిళలు, పిల్లలను కాపాడేందుకు గ్రామస్థులు పరుగెత్తుకురాగా.. పాకిస్థాన్ సైన్యం రెండోసారి బాంబుల వర్షం కురిపించింది. ఈ రెండో దాడితో మృతులు, క్షతగాత్రుల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. వందకుపైగా క్షతగాత్రులతో ఆస్పత్రులు నిండిపోయాయి. గతవారం కరాచీలో తమ సైనిక దళాలపై జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారంగానే ఈ దాడులు జరిపినట్లు పాకిస్థాన్ ప్రకటించింది. తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్థాన్ నుంచి విడిపోయిన జమాత్-ఉల్-అహ్రార్ ఉగ్రవాదుల స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరిపామని, ఈ దాడుల్లో 29 మంది ఉగ్రవాదులు హతమయ్యారని పాకిస్థాన్ సమాచార శాఖ మంత్రి అత్తావుల్లా తారర్ తెలిపారు. అయితే పాకిస్థాన్ వాదనను ఆఫ్ఘనిస్థాన్‌లోని తాలిబన్ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఇది పిరికిపందల చర్య అని, పాకిస్థాన్ దురాక్రమణకు పాల్పడిందని తాలిబన్ ప్రతినిధి జబిహుల్లా ముజాహిద్ మండిపడ్డారు. ఈ దాడుల్లో 35 మందికిపైగా అమాయక పౌరులు మరణించారని, వీరిలో 4 నుంచి 9 ఏళ్ల వయసున్న చిన్నారులు, వృద్ధులు ఉన్నారని ఆయన తెలిపారు. పాకిస్థాన్‌పై దాడి జరిగినప్పుడు ఆ ప్రాంతంలో ఎలాంటి ఉగ్రవాదులు లేరని, సహాయక చర్యల్లో పాల్గొంటున్న మాపైనే రెండోసారి బాంబు వేశారని అన్నారు. ప్రపంచాన్ని తప్పుదోవ పట్టించేందుకు పాకిస్థాన్ అబద్ధాలు చెబుతోంది" అని దాడిలో గాయపడిన ఒక స్థానికుడు ఆవేదన వ్యక్తంచేశాడు. కాగా అఫ్గానిస్థాన్‌లో 2021లో తాలిబన్‌లు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పాక్-అఫ్గాన్ సంబంధాలు ఉద్రిక్తంగానే ఉన్నాయని, సరిహద్దుల్లో ఉగ్రవాద కార్యకలాపాలకు ఆఫ్ఘనిస్థాన్ ఆశ్రయం ఇస్తోందని పాకిస్థాన్ ఆరోపిస్తుండగా.. తమ భూభాగంలో ఉగ్రవాదులు ఎవరూ లేరని తాలిబన్‌లు స్పష్టం చేస్తున్నారు. గత 9 నెలల్లో పాకిస్థాన్ జరిపిన దాడుల్లో సుమారు 570 మంది అమాయక అఫ్గాన్ పౌరులు ప్రాణాలు కోల్పోయారని నివేదికలు చెబుతున్నాయి. ఒకవైపు అంతర్జాతీయ శాంతిదూతగా వ్యవహరిస్తూ మరోవైపు పొరుగు దేశంపై దాడులకు పాల్పడటం పాకిస్థాన్ ద్వంద్వ వైఖరిని స్పష్టంచేస్తోంది.

# రైతు ఆశీర్వాద సభ వాయిదా

మొదటి తరువాయి

చేసిన మీడియా సమావేశంలో మంత్రులు మాట్లాడారు. వాతావరణ పరిస్థితులు, వర్షాల కారణంగా ఈ నెల 30న ఖమ్మం జిల్లా చింతకాని మండలం మత్కేపల్లి క్రాస్ రోడ్, జగన్నాథపురం గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యే రైతు ఆశీర్వాద సభను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. రైతులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో సభా ప్రాంగణం పూర్తిగా బురదమయంగా మారిందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో లక్షలాది మంది రైతుల సమక్షంలో సభ నిర్వహించడం సాధ్యం కాదన్నారు. రైతు భరోసా పంపిణీ పూర్తయిన అనంతరం మరింత వైభవంగా 'రైతు ఆశీర్వాద సభ' పేరుతో ముగింపు వేడుక నిర్వహిస్తామని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. వాతావరణ శాఖ నివేదికల ప్రకారం జిల్లాలో జులై 3 లేదా 4వ తేదీ వరకు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. మరో వారం రోజుల వాతావరణ పరిస్థితులను సమీక్షించి, అనుకూలిస్తే జులై 6 లేదా 7, 8వ తేదీల్లో సభ నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు వెల్లడించారు. స్థానిక మంత్రులు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికార యంత్రాంగం సమన్వయంతో ఏర్పాట్లు కొనసాగిస్తున్నట్టు తెలిపారు.

వర్షం అడ్డపడినా భరోసా ఆగదు : మంత్రి తుమ్మల

రైతు ఆశీర్వాద సభకు వర్షం అడ్డుపడినా రైతు భరోసా నిధుల విడుదల మాత్రం యథావిధిగా కొనసాగుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. వానాకాలం సాగు దృష్ట్యా రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా రైతు భరోసా నిధుల విడుదలకు సీఎం సిద్ధంగా ఉన్నారని, మంగళవారం హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు భరోసా పథకం నిధులను విడుదల చేస్తారని వెల్లడించారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేసే ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. కేవలం తొమ్మిది రోజుల్లోనే రూ.9 వేల కోట్లను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు. రైతు భరోసా, రుణమాఫీ అంశాలపై ప్రతిపక్ష నాయకులు అర్థంపర్థం లేని విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం పదేండ్లలో రైతుబంధు కింద రూ. 72 వేల కోట్లు ఇవ్వగా, ప్రజా ప్రభుత్వం కేవలం రెండున్నరేండ్లలోనే రైతు భరోసా ద్వారా రూ. 36 వేల కోట్ల సాయం అందించిందని తెలిపారు. యూరియా యాప్ ద్వారా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు అందుతున్నాయన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం అన్ని రకాల పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేస్తోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మెన్ రాయల నాగేశ్వరరావు, ఆర్ అండ్ బీ ఎస్ఈ యాకూబ్, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసాచారి, పీఆర్ఎస్ఈ వెంకట్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, మహబూబాబాద్ జిల్లా వ్యవసాయ అధికారి విజయ చందర్, డీఆర్డీవో శ్రీరామ్, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి సునీల్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 2028 నుంచి పెట్రోల్ బైకుల రిజిస్ట్రేషన్ బంద్

**రూ.30 లక్షల లోపు ఈ-కార్లకు పన్ను రాయితీ**
**విద్యుత్తు వాహనాల పాలసీకి ఢిల్లీ సర్కార్ ఆమోదం**


**న్యూఢిల్లీ :**



దేశ రాజధానిలో స్వచ్ఛ రవాణా విధానం వైపు మళ్లింపును వేగవంతం చేసేందుకు రేఖా గుప్తా ప్రభుత్వం విస్తృత ప్రోత్సాహకాల ప్యాకేజీ ప్రకటించింది. లెఫ్టినెంట్ గవర్నర్ సంధు దీన్ని ఆమోదిస్తే జూలై 1 నుంచి దీన్ని అమలు చేస్తామని ఢిల్లీ సీఎం రేఖా గుప్తా సోమవారం తెలిపారు. ఈ విధానం 2030 మార్చి 31 వరకు అమల్లో ఉంటుందని చెప్పారు. ఈ విధానంలో విద్యుత్తు కార్లకు పన్ను రాయితీ, కొనుగోలు ప్రోత్సాహకం ఇవ్వనున్నారు.విద్యుత్తు ద్విచక్ర వాహనాలు కొనుగోలు చేసేవారికి మొదటి మూడేండ్లు వరుసగా రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు రాయితీగా ఇవ్వనున్నారు. విద్యుత్తు త్రిచక్ర వాహనాలు కొనేవారికి ఇదే విధంగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు ప్రోత్సాహకంగా ఇవ్వనున్నారు. 2027 జనవరి 1 నుంచి కేవలం విద్యుత్తు ఆటో రిక్షాలకు మాత్రమే రిజిస్ట్రేషన్ చేస్తారు. కొత్త పెట్రోల్, సీఎన్‌జీ ఆధారిత ద్వి చక్ర వాహనాలకు 2028 ఏప్రిల్ 1 నుంచి రిజిస్ట్రేషన్లు చేయరు.

# వాహనదారులకు ఊరట

**-జూలై 1 నుంచి పెట్రోల్, డీజిల్ ఆంక్షల ఎత్తివేత**
**- సాధారణ స్థితికి చేరిన ఇంధన సరఫరా:**
**-మళ్లీ అందుబాటులోకి పూర్తిస్థాయి ఇంధనం**
**-ఇరాన్-అమెరికా చర్చలతో మెరుగుపడిన పరిస్థితి**
**- ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్‌పై తొలగిన ఆంక్షలు:**



**న్యూఢిల్లీ :**

వాహనదారులకు గుడ్‌న్యూస్. పెట్రోల్, డీజిల్ సరఫరాపై విధించిన ఆంక్షలను కేంద్రం ఎత్తేయనుంది. దేశవ్యాప్తంగా ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ సరఫరాపై ఆంక్షలను కొనసాగుతున్న జూలై 1వ తేదీ బుధవారం నుంచి ఎత్తివేస్తున్నట్టు వెల్లడించింది. దేశంలో పెట్రోలియం ఉత్పత్తులు సాధారణ స్థితికి చేరినందున ఈ నిర్ణయం తీసుకున్నట్టు కేంద్రం తెలిపింది.పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా పెట్రోలియం ఉత్పత్తుల కొరత ఏర్పడడంతో.. జూన్ 12వ తేదీన సరఫరాపై కేంద్రం ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. ఇరాన్, అమెరికా మధ్య శాంతి చర్చలు, ఒప్పందాలు కుదరడంతో పరిస్థితిలో మార్పు వచ్చింది. దాంతో, దేశంలో పెట్రోల్, డీజిల్ సరఫరా మునపటి స్థితికి చేరుకుంది. ఈ నేపథ్యంలోనే ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్‌పై విధించిన ఆంక్షలను జూలై 1 నుంచి కేంద్రం ఎత్తేయనుంది.

# దేశం గర్వించే రాజధాని నగరంగా అమరావతి

మొదటి తరువాయి

జరుగుతున్నాయని తెలిపారు. పనులు వేగంగా చేసేందుకు అవసరమైన మానవ వనరులు, యంత్రాలు ఇతర సామాగ్రిని ముందుగానే సిద్ధం చేసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. ప్రస్తుతం 26,924 మంది కార్మికులు, 5140కి పైగా భారీ యంత్రాలు నిర్మాణ పనుల్లో నిమగ్నమైనట్టు మంత్రి నారాయణ సీఎంకు వివరించారు. నిర్మాణ పనులకు ఎలాంటి ఆటంకమూ లేకుండా కొండవీటి వాగు, పాలవాగు ప్రవాహాలు సజావుగా సాగేందుకు వీలుగా వాటిని వెడల్పు చేస్తున్నామని మంత్రి తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం.. భవిష్యత్ నగరంగా నిర్మిస్తు?న్న అమరావతి నిర్మాణంలో పని చేశామన్న బ్రాండ్ ను కాంట్రాక్టర్లు సంపాదించేలా పనులు చేపట్టాలని సూచించారు. కొందరు వ్యక్తులు కావాలని లిటిగెంట్లుగా మారి రాజధాని పనుల్ని అడ్డుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నారని.. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ముందుకు వెళ్లాలని సీఎం స్పష్టం చేశారు. కార్యదర్శులు, ప్రధాన కార్యదర్శుల నివాసాలు, రహదారులు, మౌలిక సదుపాయాలతో పాటు అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయ టవర్ల నిర్మాణాలపై ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. దేశవ్యాప్తంగా వివిధ పుణ్య క్షేత్రాలు, నదుల నుంచి పవిత్రమైన మట్టి, నీళ్లు తీసుకువచ్చి ఈ ప్రాంతాన్ని పునీతం చేశామని.. గత పాలకులు ఐదేళ్ల పాటు రాజధాని నిర్మాణాన్ని ఆపేశారని సీఎం అన్నారు. గడచిన రెండేళ్లుగా అమరావతి నిర్మాణాన్ని మళ్లీ గాడిలో పెట్టామన్నారు. అత్యుత్తమ నివాసయోగ్య నగరంగా నిర్మాణం చేస్తున్న అమరావతిలో భాగస్వాములం అయ్యామన్న ఆలోచనతో కాంట్రాక్టు సంస్థలు పనిచేయాలని సీఎం సూచించారు. పనులు పూర్తి అయ్యాక రాజధాని నిర్మాణాల ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీని ఆహ్వానిస్తామని సీఎం తెలిపారు. నిర్మాణ పనుల వేగంతో పాటు నాణ్యత పై కూడా ఎక్కడా రాజీ లేకుండా చేపట్టాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయ భవనాలు ఐకానిక్ నిర్మాణాలుగా ఉండాలని పేర్కొన్నారు. అమరావతికి పేరు తెచ్చేలా ఈ భవనాలను నిర్మించాలన్నారు. రాజధాని నిర్మాణంలో చిన్న ఇబ్బందులు కూడా లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ప్రతీ రెండు నెలలకు ఒకసారి నిర్మాణాల పురోగతిపై సమీక్షిస్తానని సీఎం స్పష్టం చేశారు. ఎల్ అండ్ టీ, షాపూర్ జీ పల్లోంజి, మెగా ఇంజినీరింగ్, ఎన్సీసీ, బీఎస్ఆర్, కేఎంవీ సహా వేర్వేరు కాంట్రాక్టు సంస్థలు చేపట్టిన పనులకు సంబంధించిన అంశాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయా సంస్థల ప్రతినిధులకు సీఎం దిశా నిర్దేశం చేశారు.

# హరీష్ రావుకు మెంటల్ బ్యాలెన్స్ తప్పింది

మొదటి తరువాయి

వ్యాఖ్యలపై పై విధంగా స్పందించారు. తెలంగాణ ప్రజానీకం మాకు ఐదేళ్లకు అధికారమిచ్చారు. రెండున్నరేళ్లకే ఎందుకు అసెంబ్లీని రద్దు చేస్తాం. ఇంకా రెండున్నరేళ్ల సమయం ఉంది. గడచిన రెండున్నర సంవత్సరాలలో జరిగిన ప్రతి ఎన్నికల్లోనూ ప్రజల తీర్పు ఏవిధంగా ఉందో హరీష్‌రావుకు తెలుసు. ఇప్పుడు కొత్తగా వచ్చే తీర్పు ఏముంది? రెండుకాళ్లు లేనివాడు చూసుకుందాం రా.. అని సవాలు విసిరినట్లే బిఆర్ఎస్ నాయకుల సవాళ్లు ఉంటున్నాయన్నారు. ఈ ప్రభుత్వం చేసే మంచిపనులను జీర్ణించుకోలేక భవిష్యత్తులో అధికారం దక్కదనే ఆవేశం, ఆక్రోశంతో కేటీఆర్ ఉక్రోషాన్ని వెళ్లగక్కుతున్నారు. నా నియోజకవర్గం పాలేరులో కేటీఆర్ విమర్శలు ఇదే కోవలోకి వస్తాయి. బిఆర్ఎస్ నాయకులు చేసే చిల్లర విమర్శలకు ప్రతిసారీ స్పందించను. ఎప్పుడో ఒకసారి కచ్చితంగా కర్ర కాల్చి వాత పెడతా. కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తేనే బాంబులు పేలినట్టుకాదు. ప్రజలు ఛీ కొట్టినా బాంబులు పడ్డట్టే. ఏ వ్యక్తిమీదా వ్యక్తిగత కక్షపూరితమైన చర్యలు తీసుకోవాలనే ఆలోచన ఈ ప్రభుత్వానికి లేదు. తప్పుచేసిన వాళ్ళను జైలులో వేస్తేనే శిక్షించినట్లు కాదు. ప్రతి ఎన్నికల్లో వాళ్లను ఓడించి ప్రజలు శిక్షిస్తూనే ఉన్నారు. తమిళనాడు లాంటి పరిస్థితి ఈ రాష్ట్రంలో తీసుకురాం. అధికారంలోకి వస్తామని బిజేపీ పగటికలలు కంటోంది. ఆశ ఉండడంలో తప్పులేదు కానీ ఆ పార్టీ అత్యాశకు పోతోంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కనీసం డిపాజిట్ రాని పార్టీ అధికారం గురించి ఆశ పడుతోంది. బిజేపీ, బిఆర్ఎస్ ఒకే తాను ముక్కలు. కాళేశ్వరం అవినీతి, ధర్మల్ పవర్ ఎ÷-లాంట్ అక్రమాలపై సిబిఐ విచారణ చేయాలని అడిగితే బిజేపీ ఇప్పటివరకు స్పందించలేదు. ఈ సారి రైతు భరోసా నిధులను అనుకున్నదానికంటే రెండు మూడు రోజుల ముందే వారం రోజుల్లోనే రైతుల ఖాతాలో జమచేస్తాం. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇప్పటివరకు 18 నియోజకవర్గాలలో 23 స్థలాలను గుర్తించడం జరిగిందన్నారు. కొత్త రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేసే ఆలోచన ప్రభుత్వానికి లేదు. భూముల ధరల సవరణలు ఎక్కడైనా పొరపాటుగా ఎక్కువ ధర నిర్ణయిస్తే సరిచేయడానికి సిద్ధంగా ఉన్నాం. తాండూరులో ఇదే విధంగా జరిగితే సరిదిద్దడం జరిగింది. అని మంత్రి పొంగులేటి అన్నారు.

# ఉద్యోగులకు తీపికబురు


మొదటి తరువాయి

రిటైర్డ్ సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగ జేఏసీ నాయకులకు ఇచ్చిన హామీ మేరకు, సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను 100 రోజుల్లో రూ. ఆరు వేల కోట్లు విడుదల చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గత నెల 29న మొదటి విడతగా రూ.రెండు వేల కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. రెండో విడతలో మరో రూ.రెండు వేల కోట్ల నిధులను విడుదల చేసి తన నిబద్ధతను నిరూపించుకుంది. ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తున్నది. అందులో భాగంగా రిటైర్డ్ ఉద్యోగులు, జిల్లా పరిషత్ ఉపాధ్యాయులకు సంబంధించిన జనరల్ ప్రావిడెంట్ ఫండ్ (జీపీఎఫ్) బకాయిలను వంద శాతం చెల్లించి, వారి ఖాతాలను పూర్తిగా క్లియర్ చేసినట్టు ప్రభుత్వం తెలిపింది. ప్రస్తుతం రిటైర్డ్ ఉద్యోగుల జీపీఎఫ్ ఖాతాల్లో ఎలాంటి పెండింగ్‌లు లేవని స్పష్టం చేసింది. రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించి గతేడాది సెప్టెంబర్ వరకు ఉన్న కమ్యూటేషన్ బకాయిలన్నింటినీ ప్రభుత్వం పూర్తిగా చెల్లించిందని పేర్కొంది. పెండింగ్‌లో ఉన్న రూ.పది వేలలోపు విలువ కలిగిన చిన్న మొత్తాల బిల్లులన్నింటినీ ప్రభుత్వం పరిష్కరించిందని తెలిపింది. ఈ విభాగంలో దాదాపు ఐదు లక్షలకుపైగా ఉన్న టోకెన్లను గుర్తించి, ఏమాత్రం జాప్యం లేకుండా చెల్లింపులు జరిపినట్టు పేర్కొంది. ప్రభుత్వ నిర్ణయంపై ఉద్యోగ సంఘాల నేతలు సంతోషం వ్యక్తం చేశారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ఉద్యోగుల సమస్యల పట్ల ప్రభుత్వం చూపుతున్న సానుకూల ధోరణి అభినందనీయమని తెలిపారు.

# నేడు మిడ్జిల్‌కు హరీష్‌రావు

- కేటీఆర్ గైర్హాజర్
- మన్యం వెంకట్‌రెడ్డి విగ్రహావిష్కరణకు భారీ ఏర్పాట్లు..

**మిడ్జిల్ జూన్ 29( నేటి దర్శిని ప్రతినిధి):** మిడ్జిల్ మాజీ సర్పంచ్ మన్యం రాధిక భర్త, దివంగత ప్రజానాయకుడు మన్యం వెంకట్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించనున్న వెంకట్‌రెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వైరల్ ఫీవర్ కారణంగా హాజరు కాలేకపోతున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఆయన స్థానంలో బీఆర్ఎస్ ట్రబుల్ షూటర్, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ మేరకు మండల పార్టీ అధ్యక్షుడు పాండు యాదవ్, మాజీ ఎంపీపీ సుదర్శన్ బరిగెల, మాజీ జడ్పీటీసీ శశిరేఖా బాలు, నాయకులు జంగా రెడ్డి, జైపాల్ రెడ్డి, గంజి కృష్ణ, సర్పంచ్‌లు శ్రీనివాస్ గౌడ్, గోపాల్ ముదిరాజ్, నాయకులు జగన్ గౌడ్ సోమవారం సంయుక్తంగా వెల్లడించారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. హరీశ్‌రావు రాక




నేపథ్యంలో మిడ్జిల్ మండల కేంద్రం రాజకీయ సందడితో కళకళలాడుతోంది. జడ్చర్ల--కల్వకుర్తి జాతీయ రహదారి ఇరువైపులా భారీ ఫ్లెక్సీలు, కటౌట్లు, గులాబీ జెండాలు, స్వాగత తోరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో కూడా బీఆర్ఎస్ శ్రేణులు



విస్తృత ప్రచారం నిర్వహిస్తూ నాయకుల రాకకు ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. విగ్రహావిష్కరణ అనంతరం వెంకట్‌రెడ్డి సేవలను స్మరించుకుంటూ నివాళులర్పించడంతో పాటు పార్టీ నాయకుల సమావేశం నిర్వహించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి. కార్యక్రమానికి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు వివిధ ప్రాంతాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యే అవకాశముండటంతో మిడ్జిల్ మండల కేంద్రంలో రాజకీయ వాతావరణం నెలకొంది. పోలీసులు కూడా ట్రాఫిక్, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం.

## పోలీసులతో గొడవకు దిగిన వ్యక్తికి జైలు శిక్ష

**మిడ్జిల్, జూన్29 (నేటి దర్శిని ప్రతినిధి):** మిడ్జిల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో దురుసుగా ప్రవర్తించిన వ్యక్తికి కోర్టు మూడు రోజుల సాధారణ జైలు శిక్ష విధించింది. మిడ్జిల్ మండలం కాటంగడ్డ తండాకు చెందిన లక్ష్మణ్ పవార్ అనే వ్యక్తి మద్యం మత్తులో ఇటీవల మిడ్జిల్ పోలీస్ స్టేషన్‌కు వచ్చాడు. ఈ క్రమంలో అక్కడ విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందితో వాగ్వాదానికి దిగడంతో పాటు అనుచితంగా ప్రవర్తించినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై మిడ్జిల్ పోలీసులు డీడీ కేసు నమోదు చేశారు. అనంతరం నిందితుడిని గౌరవ కోర్టులో హాజరుపరచగా,



కేసును విచారించిన న్యాయమూర్తి నేరం రుజువైన నేపథ్యంలో లక్ష్మణ్ పవార్‌కు మూడు రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. విధుల్లో ఉన్న పోలీసుల పట్ల అనుచితంగా ప్రవర్తించినా, చట్టాన్ని ఉల్లంఘించినా చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

## ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన ఉప సర్పంచ్ విజయ్ రాథోడ్



**ఆమనగల్లు,జూన్29(నేటి దర్శిని):** ఆమనగల్లు మండల పరిధిలోని మేడిగడ్డ తండా గ్రామపంచాయతీలో పోలింగ్ బూత్ నెంబర్లు 197,198,199 లో నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని బిఎల్ఎ సూపర్వైజర్ మేడిగడ్డ ఉప సర్పంచ్ విజయ్ రాథోడ్ పరిశీలించారు. ఓటరు జాబితా సవరణ, మ్యాపింగ్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ అధికారులకు అవసరమైన సూచనలు చేశారు.ప్రతి అర్హులైన ఓటరు తమ వివరాలను పరిశీలించి అవసరమైన సవరణలు చేసుకోవాలని మేడిగడ్డ తండా ఉపసర్పంచ్ విజయ్ రాథోడ్ కోరారు.ఈ కార్యక్రమంలో బిఎల్ఓ లు సరోజ,జయ,బిఎల్ఎ హరిలాల్ తదితరులు పాల్గొన్నారు.

## హోమంతాలపల్లిలో హరితహారం - వీవో నూతన భవనానికి భూమిపూజ

- ఇంటింటికీ మొక్కల పంపిణీ.. రూ.10 లక్షలతో భవన నిర్మాణానికి శ్రీకారం



**చింతపల్లి, జూన్ 29 (నేటి దర్శిని):** చింతపల్లి మండలం హోమంతాలపల్లి గ్రామంలో హరితహారం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో



మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే ప్రతి ఇంటికీ మొక్కలను పంపిణీ చేసి వాటిని సంరక్షించాలని కోరారు. అనంతరం రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న వీవో (విలేజ్ ఆర్గనైజేషన్) నూతన భవనానికి భూమిపూజ నిర్వహించారు. గ్రామాభివృద్ధికి ఈ భవనం ఉపయోగపడుతుందని, మహిళా సంఘాల కార్యకలాపాలకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వంగాల స్రవంతి రమేష్, ఉప సర్పంచ్ ముదిగొండ మంజుల, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్, పంచాయతీ కార్యదర్శి ప్రియాంక, వార్డు సభ్యులు గోవర్ధనాచారి, బత్తిని మధుసూదన్ రెడ్డి, ప్రభాకర్, ఫీల్డ్ అసిస్టెంట్ ముదిగొండ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## మైత్రి లహరి కాలనీకి నూతన కార్యవర్గం ఎన్నిక



**పెద్ద అంబర్‌పేట్, జూన్ 29, (నేటి దర్శిని) :** పెద్ద అంబర్‌పేట్ మండలంలోని పసుమాముల రోడ్డులో ఉన్న మైత్రి లహరి కాలనీ సంక్షేమ సంఘం 2026--2027 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ప్రకటించింది. ఎన్నికైన సభ్యులందరికీ సంఘం హృదయపూర్వక అభినందనలు తెలియజేసింది. కాలనీ సంక్షేమం, అభివృద్ధి కోసం నూతన కార్యవర్గం అంకితభావం, పారదర్శకత, నిబద్ధతతో పనిచేస్తుందని సంఘం విశ్వాసం వ్యక్తం చేసింది. సామాజిక భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం, పౌర సౌకర్యాలను మెరుగుపరచడం, పరిశుభ్రతను ప్రోత్సహించడం, భద్రతను పెంపొందించడం, నివాసితులందరి కోసం సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలను చేపట్టడం కమిటీ ప్రధాన లక్ష్యాలని పేర్కొంది. నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా జి. శేఖర్, ప్రధాన కార్యదర్శిగా ఎస్. మురళి, ఉపాధ్యక్షుడిగా ఎం. రవీందర్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సిహెచ్. రవీందర్ రెడ్డి, కోశాధికారిగా ఎం. మధు రెడ్డి ఎన్నికయ్యారు.కార్యవర్గ సభ్యులుగా కె. దామోదర్ రెడ్డి, ఎన్. భాస్కర్ రావు, వై. ఇంద్ర రెడ్డి, పి. గణేష్, కె. అనిల్ రెడ్డి ఎన్నికయ్యారు.మైత్రి లహరి కాలనీని మరింత పరిశుభ్రమైన, సురక్షితమైన, చైతన్యవంతమైన నివాస ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు నివాసితులందరూ నిరంతర సహకారం అందించాలని సంఘం కోరింది.

## యువత స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి

- జాతీయ బీసీ కమిషన్ మాజీ మెంబర్ తల్లోజు ఆచారి




**ఆమనగల్లు,జూన్29(నేటి దర్శిని):** యువత ఉద్యోగాల కోసం మాత్రమే ఎదురు చూడకుండా స్వయం ఉపాధి రంగంలో అడుగుపెట్టి ఆర్థికంగా ఎదగాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ మెంబర్ తల్లోజు ఆచారి అన్నారు. ఆమనగల్లు పట్టణానికి చెందిన అంజి,భరత్ లు సోమవారం నూతనంగా ఏర్పాటు చేసిన జమిందార్ కేఫ్ ను మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్ తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆచారి మాట్లాడుతూ యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం సమాజ అభివృద్ధికి దోహదపడుతుందని, ఉపాధి అవకాశాలను సృష్టించే యువతను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని ఆయన అన్నారు. యువత ధైర్యంగా వ్యాపార రంగంలోకి వచ్చి పట్టుదలతో కృషి చేస్తే విజయాలు సాధించవచ్చు అని ఆకాంక్షించారు. అనంతరం కేఫ్ నిర్వాహకులు అంజి, భరత్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు ఎర్రవోలు మహేష్, ముక్తాల వెంకటయ్య,కో ఆప్షన్ మెంబర్ చుక్క అల్లాజిగౌడ్,మాజీ వైస్ చైర్మన్ దుర్గయ్య, రేవల్లి రాజు, వెంకటేష్, జంగయ్య, చంద్రయ్య, గోపాల్,జంగయ్య, శంకరయ్య, శివ,సురేష్, కృష్ణ,హరీష్,తదితరులు పాల్గొన్నారు.

## మోదుగుల మల్లేపల్లిలో నూతన గ్రామపంచాయతీ భవనానికి శంకుస్థాపన

- రూ.20 లక్షలతో పంచాయతీ భవనం.. రూ.10 లక్షలతో సంఘ భవనం నిర్మాణం



**చింతపల్లి, జూన్ 29 (నేటి దర్శిని):** చింతపల్లి మండలంలోని మోదుగుల మల్లేపల్లి గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవనం, సంఘ భవన నిర్మాణానికి గ్రామ సర్పంచ్ ముద్దం మల్లేష్ పాలకవర్గ సభ్యులతో కలిసి భూమిపూజ నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ ముద్దం మల్లేష్ మాట్లాడుతూ, నూతన గ్రామపంచాయతీ ఏర్పాటు ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఫలాలు నేరుగా ప్రజలకు చేరడంతో పాటు స్థానిక పరిపాలన మరింత సులభతరం అవుతుందని తెలిపారు. ప్రజలకు అధికారులు, పాలకవర్గం ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సమస్యలను సత్వరం పరిష్కరిస్తారని పేర్కొన్నారు.మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) నిధులతో రూ.20 లక్షల వ్యయంతో గ్రామపంచాయతీ భవనం, రూ.10 లక్షలతో సంఘ (వీవో) భవనం నిర్మించనున్నట్లు వెల్లడించారు. గ్రామపంచాయతీ భవనం అందుబాటులోకి వస్తే వీధి దీపాలు, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి స్థానిక సమస్యలకు వేగంగా పరిష్కారం లభిస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గడిగ సైదులు, ఐతపాక జంగయ్య, మద్దెల మహేష్, మాజీ సర్పంచ్ ముద్దం కృష్ణయ్య, గండేటి వెంకటయ్య, గడిగ యాదయ్య, చందూరు అబ్బయ్య, నల్లగంతుల మల్లేష్, ఓయోపల్లి పర్వతాలు, పంచాయతీ కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో ప్రజల సమస్యలు విన్న జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్

- త్వరిత పరిష్కారానికి ఆదేశాలు

**మిడ్జిల్, జూన్ 29, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో



జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ జిల్లా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల వినతులను స్వీకరించి, వారి సమస్యలను శ్రద్ధగా విన్నారు.
ఈ సందర్భంగా కుటుంబ వివాదాలు, భూ తగాదాలు, మోసపూరిత వ్యవహారాలు, ఇతర వ్యక్తిగత సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను పరిశీలించిన ఎస్పీ సంబంధిత అధికారులతో నేరుగా మాట్లాడి ప్రతి ఫిర్యాదుపై త్వరితగతిన స్పందించాలని ఆదేశించారు.అందిన ప్రతి వినతిపత్రాన్ని నిష్పక్షపాతంగా పరిశీలించి, బాధితులకు చట్టపరమైన న్యాయం అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సమస్యల స్వభావాన్ని బట్టి తక్షణ విచారణ జరిపి, నిర్దిష్ట గడువులో నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ మాట్లాడుతూ,"ప్రజలు పోలీసు శాఖపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టడం మా బాధ్యత. ప్రతి ఫిర్యాదును బాధ్యతాయుతంగా స్వీకరించి, పారదర్శకంగా విచారణ జరిపి, చట్టపరమైన చర్యలు తీసుకుంటాం" అని పేర్కొన్నారు.
అలాగే ప్రజల సమస్యలను ఆలస్యం చేయకుండా త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. బాధితులకు న్యాయం చేకూరేలా చట్టబద్ధమైన చర్యలు తీసుకోవడం పోలీసు శాఖ ప్రధాన కర్తవ్యమని తెలిపారు.జిల్లా ప్రజలు తమ సమస్యలను చట్టబద్ధమైన మార్గాల్లో పోలీసు శాఖ దృష్టికి తీసుకురావాలని, ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా విచారించి తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు కార్యాలయ అధికారులు మరియు సంబంధిత విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్ర డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిని సన్మానించిన రంగారెడ్డి ఇంచార్జ్ ఎడ్ల శ్రీశైలం



**ఆమనగల్లు,జూన్29 (నేటి దర్శిని):** ఆమనగల్ పట్టణంలో తెలంగాణ రాష్ట్ర ఓనర్ కం డ్రైవర్ అసోసియేషన్ (టిజిటిడిఏ) అధ్యక్షుడు శివ ఆమనగల్లుకు విచ్చేసిన సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఇన్చార్జ్ ఎడ్ల శ్రీశైలం మరియు ఆమనగల్లు అసోసియేషన్ సభ్యులు వారిని మర్యాదపూర్వకంగా కలిసి,పూలమాలలతో, శాలువాలతో సన్మానించి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో నారమోని తిరుమలేష్, ఎండి ఆరిఫ్,కటకం సత్యం,పూసల అశోక్, తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## మన్ కీ జూట్"




భారత ప్రధాని నరేంద్రమోడీ తన 'మన్ కీ బాత్' 135వ ఎపిసోడ్‌లో ఆదివారం దేశ ప్రజలకు మరోసారి నీతిపాఠాలు చెప్పారు. అయితే ఈసారి ధన్యవాదాలతో తన ప్రసంగాన్ని ప్రారంభించారు. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో దేశ ప్రజలు బంగారం కొనుగోళ్లు తగ్గించడం, విదేశీ పర్యటనలను వాయిదా వేయడం వంటి దేశ ప్రయోజనాల కోసం ప్రజలు బాధ్యతగా వ్యవహరించారని ప్రశంసించారు. ప్రజలకు పొదుపు, త్యాగం, మిత వ్యయం చెప్పడం తప్పుకాదు. కానీ, ప్రజలకు చెప్పే సందేశం, సర్కార్ ఆచరణ ఒకేతీరులో ఉన్నాయా? అన్నదే అసలు ప్రశ్న. కష్టకాలంలో ప్రజలు త్యాగాలు చేయాలని పిలుపునివ్వడం మంచిదే, ఆ కష్టాలకు కారణాలేమిటన్నది వేరే అంశం. కానీ, ప్రభుత్వం తన ఖర్చులు, ప్రాధాన్యతలు, విధానాల విషయంలో ఎంతమేరకు మితవ్యయం పాటిస్తోంది? అన్నదే ప్రధాన ప్రశ్న. ప్రజలు బంగారం కొనవద్దని చెప్పే ముందు, దాని దిగుమతులు పెరగడానికి దారితీస్తున్న ఆర్థిక విధానాలపై ప్రభుత్వం ఆత్మపరిశీలన చేసిందా? రూపాయి బలహీనపడటం, ద్రవ్యోల్బణం, పెట్టుబడు లపై అనిశ్చితి కార ణంగా ప్రజలు బంగారాన్ని భద్రమైన పెట్టుబడిగా ఎంచు కుంటున్న వాస్తవాన్ని విస్మరించలేం. బంగారం కొనుగోలు విలాసాలకు సంబం ధించినదే కాదు, దానిపై లక్ష?లాది మంది స్వర్ణకారులు, చిన్న నగల దుకాణాలు, చేతివృత్తుల జీవనం ఆధారపడి ఉంటుంది. ఈ నిర్ణయం వల్ల ఉపాధిపై పడే ప్రభావం ఏమిటి? ఈ ప్రశ్నలకు సమాధానం లేదు. అలాగే విదేశీ పర్యటనలను తగ్గించినందుకు ప్రజలకు కృతజ్ఞతలు చెప్పిన ప్రధాని, తన విదేశీ పర్యటనల వల్ల దేశానికి వచ్చిన ప్రత్యక్ష? పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు, దౌత్య ప్రయోజనాలపై కూడా స్పష్టమైన లెక్కలు చెప్పాలి కదా? ఇక పెట్రోల్,డీజిల్ పొదుపు పాటించాలని హితబోధ చేసిన మరుసటి రోజే మధ్యప్రదేశ్‌లో సౌభాగ్య సింగ్ ఠాకూర్ అనే బీజేపీ నేత, పాఠ్య పుస్తక సంస్థ ఛైర్మన్‌గా నియమితులైనందుకు ఉజ్జాయినీ నుంచి భోపాల్ వరకు భారీ వాహనాల కాన్వాయ్‌తో ప్రయాణించిన వీడియో వైరల్ అయింది. దీంతో 'ప్రజలు మాత్రమే త్యాగాలు చేయాలా?' అంటూ సోషల్ మీడియాలో ప్రశ్నల వర్షం కురిసింది. అంతెందుకు పొరుగు రాష్ట్రం ఏపీలో కూటమి మంత్రి ప్రధాని మాటలను స్ఫూర్తిగా తీసుకుని సైకిల్‌పై అధికారిక కార్యక్రమానికి వెళ్లాడు. కానీ, ఆయన వెనుక కార్లు, మీడియా వాహనాలు పరుగులు పెట్టాయి. ఇక్కడ 'పొదుపు' కాస్త మరింత 'భారం' అయింది. ప్రజలు పాటించారు సరే, పాలకులకే క్రమశిక్ష?ణ లేకపోతే ఎలా? అన్న నెటిజన్ల ప్రశ్నలకు సమాధానమేది? మన్ కీ బాత్‌లో అతి ముఖ్యమైన సందేశం ప్రజలు మూఢ నమ్మకాలను వీడి శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించాలని సూచించడం. ప్రధాని చేసిన వ్యాఖ్యల్ని స్వాగతించాల్సిందే. శాస్త్రీయ దృక్పథం ప్రతి సమాజానికీ అవసరం. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వ విధానాలు, అధికార పార్టీ నాయకుల వైఖరి ఆ సందేశానికి అనుగుణంగా ఉన్నాయా? అనే ప్రశ్న తలెత్తుతోంది. రాజ్యాంగంలోని 51(ఎ)(హెచ్) అధికరణం శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం ప్రతి పౌరుడి విధిగా పేర్కొంటుంది. కానీ విద్యారంగంలో ఎన్‌సీఈఆర్‌టీ చేస్తున్న దేమిటి? చరిత్ర పాఠాలను మార్పులు చేశారు. పదో తరగతి పాఠ్యాంశం నుంచి 'డార్విన్ పరిణామ సిద్ధాంతం' తొలగించారు. వీటిపై విద్యావేత్తలు, శాస్త్రవేత్తలు ఎన్ని అభ్యంతరాలు వ్యక్తం చేసినా కేంద్రం పట్టించుకోలేదు. అలాగే శాస్త్రీయ ఆధారాలు లేని వాదనలు, మూఢ విశ్వాసాలను సమర్థించే వ్యాఖ్యలు బహిరంగ వేదికలపై వచ్చినప్పుడు ప్రభుత్వం లేదా అధికార పార్టీ వాటిని ఖండించడంలో చూపిన నిర్లక్ష్యంపై కూడా విమర్శలనేకం. కొన్ని విశ్వవిద్యాలయాల్లో జ్యోతిష్యం, భారతీయ జ్ఞాన సంప్రదాయాల కోర్సులు చేర్చడం, భూత వైద్యం లాంటి అంశాలు ప్రవేశపెట్టడంపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. విజ్ఞాన శాస్త్రానికి విరుద్ధమైన ప్రచారాలు, అశాస్త్రీయ వాదన లు, మూఢ విశ్వాసాలను రాజకీయంగా ప్రోత్సహించే ధోరణులు పెరగడానికి కారణం కేంద్రమేనన్న సంగతి దేశమంతా గమనిస్తూనే ఉంది. శాస్త్రీయ దృక్పథం ప్రజలకు మాత్రమే బోధించే నీతి కాదు, అది ప్రభుత్వ విధానాల్లో, విద్యా వ్యవస్థలో, ప్రజా ప్రతినిధుల ప్రవర్తనలోనూ ప్రతిబింబించాలి. ప్రజలు దేశం కోసం త్యాగం చేయడానికి సిద్ధంగా ఉంటారు. కానీ ఆ త్యాగాలలో ప్రభుత్వం కూడా భాగస్వామి కావాలి. ప్రజలకు పొదుపు చెప్పే పాలకులు, ప్రభుత్వ వ్యయాల్లో కూడా అదే క్రమశిక్షణను చూపాలి. మాటలకు, చేతలకు మధ్య అంతరం పెరిగినప్పుడు ప్రజలు ప్రశ్నించడం సహజం. 'త్యాగం ప్రజలకు, ప్రచారం ప్రభుత్వానికి' అనే భావన బలపడకుండా ఉండాలంటే, ఆచరణ తన సందేశాలకు నిదర్శనంగా నిలవాలి. లేదంటే 'మన్ కీ బాత్'లో ప్రధాని ఎన్ని హావభావాలు ప్రదర్శించినా, ఆవేదనగా మాట్లాడినా అది 'మన్ కీ జూట్'నే అవుతుంది తప్ప దేశానికి ఒరిగేదేమీ ఉండదు.

# ఉలిక్కిపడిన బెంగళూరు


### ఒకే రోజు మూడు హత్యలు..



**న్యూఢిల్లీ (జూన్ 29) (నేటి దర్శిని)**
ఒకే రోజు మూడు హత్యలు జరిగాయి. వేర్వేరుగా జరిగిన ఈ సంఘటనల్లో ఇద్దరు మహిళలు హత్యకు గురికాగా, ఒక నేరస్తుడ్ని ప్రత్యర్థులు నరికి చంపారు. ఈ మూడు హత్యలతో రాజధాని నగరం ఉలిక్కిపడింది. కర్ణాటక రాజధాని బెంగళూరులో ఈ మూడు సంఘటనలు జరిగాయి. ఆదివారం మహాలక్ష్మి లేఅవుట్‌లో మొదటి హత్య జరిగింది. పెళ్లి విషయంలో గొడవ కారణంగా 23 ఏళ్ల అంజలిని ఆమె ప్రియుడు రాజీవ్, కత్తితో పొడిచి హత్య చేశాడు. వీరిద్దరూ మూడేళ్లకు పైగా ప్రేమలో ఉన్నారని పోలీసులు తెలిపారు. అయితే రాజీవ్ నేర చరిత్ర కారణంగా ఆ యువతి కుటుంబం వారి సంబంధాన్ని వ్యతిరేకించినట్లు తెలిసిందన్నారు. నిందితుడ్ని అరెస్ట్ చేసినట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.కాగా, అదే రోజున కొన్ని గంటల్లోనే బొమ్మనహల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మునియప్ప లేఅవుట్‌లో మరో మహిళ హత్యకు గురైంది. అద్దె ఇంట్లో నివసిస్తున్న 40 కృష్ణ బర్మన్ గొంతు నులిమి చంపి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఆమె హత్యపై దర్యాప్తు చేస్తున్నారు. ఆ మహిళ ఇటీవల ఎవరితో మాట్లాడింది? ఆమె కదలికలు, ఇతర వివరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. మరోవైపు ఆదివారం సాయంత్రం జేపీ నగర్ రోడ్డులోని ఐజీ సర్కిల్ సమీపంలో బహిరంగంగా మూడో హత్య జరిగింది. హత్య, హత్యాయత్నం, దోపిడీతో సహా పలు క్రిమినల్ కేసులున్న నేరస్థుడు రాజా అలియాస్ హల్క్ రాజాను కారులో వచ్చిన దుండగులు వెంబడించారు. కత్తులు, కొడవళ్లతో దాడి చేసి నరికి చంపారు. పాత కక్షలు, ప్రతీకార చర్యగా ప్రత్యర్థులు అతడ్ని హత్య చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఒకే రోజు మూడు హత్యలు జరుగడంతో బెంగళూరు వాసులు ఉలిక్కిపడ్డారు. రాజధాని నగరంలో శాంతిభద్రతలపై ఆందోళన చెందుతున్నారు.

# రాష్ట్రంలో అరు నెలల్లోపే అసెంబ్లీ ఎన్నికలు..


### -సిద్ధంగా ఉండాలని డీఎంకే శ్రేణులకు ఎంకే స్టాలిన్ పిలుపు.



**న్యూఢిల్లీ (జూన్ 29) (నేటి దర్శిని).**
తమిళనాడు లో రాజకీయ పరిణామాలు వేగంగా మారే అవకాశం ఉందని డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ అన్నారు. మరో ఐదేళ్లు ఎదురుచూడాల్సిన అవసరం లేదని, మూడు నెలలు లేదా ఆరు నెలల్లో ఎన్నికలు రావొచ్చని పార్టీ శ్రేణులను అప్రమత్తం చేశారు. ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. చెన్నై లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో మాజీ మంత్రి బెంజమిన్‌తో పాటు పలువురు ఏఐఏడీఎంకే నేతలు, కార్యకర్తలు డీఎంకేలో చేరారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న టీవీకే ప్రభుత్వానికి సొంతంగా మెజారిటీ లేదన్నారు. 118 సీట్ల మెజారిటీ అవసరం కాగా ఆ పార్టీకి 108 స్థానాలే వచ్చాయని గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రభుత్వం ఇతర పార్టీల మద్దతుతోనే కొనసాగుతోందన్నారు. ఇటీవల వరకు డీఎంకే కూటమిలో ఉన్న కాంగ్రెస్, వామపక్షాలు, వీసీకే, ఐయూఎంఎల్ మద్దతుతోనే ప్రభుత్వం నడుస్తోందని చెప్పారు. అలాంటి ప్రభుత్వం ఎంతకాలం కొనసాగుతుందో చెప్పలేమన్నారు. ఎప్పుడు కూలిపోతుందో తెలియదని వ్యాఖ్యానించారు. అందుకే పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధం కావాలని స్టాలిన్ సూచించారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చిన తర్వాత కాకుండా ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో పని ప్రారంభించాలని కోరారు. డీఎంకేను మళ్లీ అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. టీవీకే ప్రభుత్వంపై కూడా స్టాలిన్ విమర్శలు గుప్పించారు. గత నెల రోజులుగా రాష్ట్రంలో అభివృద్ధి మందగించిందన్నారు. పెట్టుబడిదారులు ఇతర రాష్ట్రాలకు వెళుతున్నారని అన్నారు. మహిళలపై నేరాలు, మాదకద్రవ్యాల కేసులు, దోపిడీలు, పెట్రోల్ బాంబు దాడులు, విద్యుత్ కోతలు పెరిగాయని విమర్శించారు. ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ కూడా ప్రభుత్వంపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఒకప్పుడు తమిళనాడులో ఉన్న సుపరిపాలన ఇప్పుడు కనిపించడం లేదన్నారు. ప్రజలు విద్యుత్, తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం పాలన కంటే ప్రచారంపైనే ఎక్కువ దృష్టి పెడుతోందని విమర్శించారు. అసెంబ్లీ సమావేశాలు సభలా కాకుండా సినిమా షూటింగ్‌లా మారిపోయాయని ఎద్దేవా చేశారు.

# మూడేళ్ల చిన్నారిపై హత్యాచారం..

### - 65 ఏళ్ల వృద్ధుడికి మరణశిక్ష



**న్యూఢిల్లీ (జూన్ 29) (నేటి దర్శిని)**
మూడేళ్ల చిన్నారిపై అత్యాచారానికి పాల్పడి హత్య చేసిన 65 ఏళ్ల వృద్ధుడికి కోర్టు మరణశిక్ష విధించింది. ఈ నేరం అత్యంత క్రూరమైనదని న్యాయమూర్తి అభివర్ణించారు. అందుకే అత్యంత అరుదైన తీర్పు ఇచ్చినట్లు వెల్లడించారు. మహారాష్ట్రలోని పూణె జిల్లాలో ఈ సంఘటన జరిగింది. మే 1న నస్రాపూర్ గ్రామానికి చెందిన మూడేళ్ల బాలిక అదృశ్యమైంది. తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించారు.కాగా, 65 ఏళ్ల భీమ్‌రావ్ కాంబ్లే తినుబండారాల ఆశ చూపించి ఆ చిన్నారిని తీసుకెళ్లడం సీసీటీవీ ఫుటేజ్‌లో కనిపించింది. పసి దూడను చూపిస్తానని చెప్పిన వృద్ధుడు ఆ బాలికను పశువుల పాక సమీపంలోని షెడ్‌లోకి తీసుకెళ్లాడు. అక్కడ ఆ చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ తర్వాత ఆ బాలిక నోరు మూసి, ఛాతిపై గాయం చేసి ఆమెను హత్య చేశాడు. చిన్నారి కోసం వెతకగా మృతదేహం అక్కడ లభించింది. మరోవైపు సీసీటీవీ ఫుటేజ్, ఇతర ఆధారాల సహాయంతో నిందితుడు భీమ్‌రావ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. చిన్నారిపై హత్యాచారం కేసు దర్యాప్తు కోసం సిట్‌ను ఏర్పాటు చేశారు. పోలీసులు పగలతో పాటు రాత్రులు కూడా పని చేశారు. 15 రోజుల్లో కీలక ఆధారాలు సేకరించారు. 55 మంది సాక్షుల వాంగ్మూలాలు రికార్డ్ చేశారు. 1,200 పేజీల వివరణాత్మక ఛార్జిషీట్‌ను కోర్టులో దాఖలు చేశారు. కాగా, పూణే జిల్లా, సెషన్స్ కోర్టులో ఈ కేసుపై రోజువారీ విచారణ జరిగింది. మూడేళ్ల బాలిక కిడ్నాప్, లైంగిక వేధింపులు, అత్యాచారం, హత్య ఆరోపణల్లో నిందితుడు భీమ్‌రావ్ కాంబ్లేను దోషిగా కోర్టు నిర్ధారించింది. యావజ్జీవ కారాగార శిక్ష విధించాలన్న నిందితుడి తరఫు న్యాయవాది అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. ఈ కేసులో ఎలాంటి దయ లేదా ఉదారత చూపాల్సిన అవసరం లేదని కోర్టు అభిప్రాయపడింది. మరోవైపు సుప్రీంకోర్టు నిర్వచించిన 'అరుదైన వాటిలోకెల్లా అరుదైన' వర్గంలోకి ఈ నేరం వస్తుందని ప్రాసిక్యూషన్ తరఫు న్యాయవాదులు కోర్టులో వాదించారు. మరణశిక్షపై సుప్రీంకోర్టు ఇచ్చిన 12 కీలక తీర్పులను ప్రస్తావించారు. దీంతో ప్రాసిక్యూషన్ వాదనలతో కోర్టు ఏకీభవించింది. ఈ నేరంలోని క్రూరత్వానికి ఎలాంటి కనికారం చూపే ఆస్కారం లేదని న్యాయమూర్తి ఎస్.ఆర్. సలుంఖే వ్యాఖ్యానించారు. 'ఈ నేరం అత్యంత క్రూరమైనది. అరుదైన వాటిలో అత్యంత అరుదైనది. ఇది సమాజ అంతరాత్మనే కలచివేసేలా ఉన్నది. పసి బాలికపై తన కామ వాంఛ తీర్చుకునేందుకు నిందితుడు ఈ దారుణానికి పాల్పడ్డాడు' అని న్యాయమూర్తి అన్నారు. నేరం జరిగిన రెండు నెలల్లోపే దోషికి ఉరిశిక్ష విధిస్తూ సోమవారం తీర్పు ఇచ్చారు.

# అయోధ్య బార్ అసోసియేషన్ కీలక నిర్ణయం..

### నిందితుల తరపున వాదిస్తే 5 లక్షల ఫైన్



**న్యూఢిల్లీ (జూన్ 29) (నేటి దర్శిని)**
అయోధ్య రామాలయంలో విరాళాలను దుర్వినియోగం చేసిన కేసులో 8 మందిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అయితే అయోధ్య బార్ అసోసియేషన్ కీలక నిర్ణయం తీసుకున్నది. నిందితుల తరపున కేసును వాదించబోమని లాయర్ల సంఘం తీర్మానించింది. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కాలికా ప్రసాద్ మిశ్రా మాట్లాడుతూ.. నిధుల చోరీ కేసులో నిందితులను తరపున ఎవరూ వాదించరు అని, ఒకవేళ వాదిస్తే వారికి 5 లక్షల జరిమానా విధించనున్నట్లు చెప్పారు. బార్ అసోసియేషన్ మరో నిర్ణయాన్ని కూడా తీసుకున్నది. రామాలయ జనరల్ సెక్రటరీ చంపత్ రాయ్, సభ్యుడు అనిల్ మిశ్రా, గోపాల్ రావు.. తక్షణమే అయోధ్య విడిచి వెళ్లాలని డిమాండ్ చేసింది. మూడు రోజుల్లోగా అయోధ్య నుంచి వెళ్లిపోకుంటే, అప్పుడు సిటీని బ్లాక్ చేస్తామని, ఎవర్నీ లోపలికి రానివ్వకుండా చేస్తామని మిశ్రా తెలిపారు. అయితే ఈ ముగ్గురిలో ఏ ఒక్కరి పేరు కూడా ఎఫ్ఐఆర్‌లో నమోదు కాకపోవడం గమనార్హం. ఈ కేసులోని 8 మంది నిందితుల్లో అవినాశ్ శుక్లా, అనుకల్ప్ మిశ్రా, లవ్ కుష్ మిశ్రా, మనీశ్ కుమార్ యాదవ్, కరుణేశ్ పాండే, రామ్ శంకర్ మిశ్రా, సుభాష్ శ్రీవాత్సవ, రామశంకర్ ఉన్నారు. నిందితులు అందరూ క్యాష్ కౌంటింగ్, విలువైన వస్తువులను భద్రత పరిచే ఉద్యోగంలో ఉన్నారు. ఈ కేసులో సీబీఐ విచారణ చేపట్టాలని బార్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. సమగ్ర విచారణ కోసం సుప్రీంకోర్టు వరకు వెళ్లనున్నట్లు ప్రసాద్ మిశ్రా తెలిపారు. చంపత్ రాయ్, అనిల్ మిశ్రా ప్రస్తుతం ట్రస్టుకు రాజీనామా చేశారు. దానిపై జూలై 7వ తేదీన నిర్ణయించనున్నారు.

# పద్మావతి కాలనీ అభివృద్ధికి కృషి చేస్తాం

● మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి



**బి.ఎన్.రెడ్డి నగర్, జూన్ 29 (నేటి దర్శిని):** బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని పద్మావతి కాలనీలో సంక్షేమ సంఘం సభ్యుల విజ్ఞప్తి మేరకు జీహెచ్ఎంసీ తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలోని పలు సమస్యలను స్థానికుల నుంచి అడిగి తెలుసుకుని, అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. కాలనీలో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం తదితర సమస్యలను పరిష్కరించేలా సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకోవాలని సంక్షేమ సంఘం ప్రతినిధులు ఆయనకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మొద్దు లచ్చి రెడ్డి మాట్లాడుతూ, పద్మావతి కాలనీ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ, పెండింగ్‌లో ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు అందుబాటులోకి తీసుకురావడానికి నిరంతరం ప్రయత్నిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజు గౌడ్, ప్రధాన కార్యదర్శి కిషన్, రాంబాయ్, సుభాష్, కిరణ్, ఎం.ఎస్. రెడ్డి, రఘురాం తదితరులు పాల్గొన్నారు.



# మిడ్జిల్‌లో ఘనంగా సహకార వారోత్సవాల ప్రారంభం..



● సింగల్ విండో చైర్మన్ కూచూరు శ్రీనివాస్ రెడ్డి

**మిడ్జిల్, జూన్ 29 (నేటి దర్శిని ప్రతినిధి):** మిడ్జిల్ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో సహకార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షులు కూచూరు శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలో రైతులు, పాలకవర్గ సభ్యులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు కూచూరు శ్రీనివాస్ రెడ్డి సహకార జెండాను ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పాల్గొన్న వారితో కలిసి సహకార ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ సహకార సంఘాలు రైతులకు నమ్మకమైన అండగా నిలుస్తూ వ్యవసాయ రంగ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. రైతులు సంఘం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సహకార సంఘాల ద్వారా పారదర్శకంగా అందించేందుకు కృషి చేస్తున్నామని, రైతుల అభివృద్ధే సంఘం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎడ్ల శంకర్ ముదిరాజ్, డైరెక్టర్ కొమ్ము ఆంజనేయులు, పాలకవర్గ సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులను పరిశీలించిన కళ్లెం నవజీవన్ రెడ్డి



**హయత్ నగర్, జూన్29 (నేటి దర్శిని):** హయత్ నగర్ డివిజన్ పరిధిలోని విద్యా నగర్ కాలనీలో తన హయాంలో మంజూరైన నిధులతో చేపడుతున్న నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులను స్థానిక మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి కాలనీ వాసులతో కలిసి శనివారం రోజున పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని ప్రత్యక్షంగా పరిశీలించి, పనులు నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో పూర్తి అయ్యేలా సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. స్థానిక ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడం తమ లక్ష్యమని పేర్కొన్నారు.కాలనీ అభివృద్ధికి ఎల్లప్పుడూ నిరంతరం కృషి కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, కాలనీవాసులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# భూ సంస్కరణలు ప్రవేశపెట్టిన గొప్ప మేధావి పివి: డాక్టర్ రియాజ్

● రవీంద్ర భారతిలో ఘనంగా పీవీ నరసింహారావు 105వ జయంతి సభ

**హైదరాబాద్,జూన్ 29(నేటి దర్శిని):** భారతదేశంలో విప్లవాత్మక భూ సంస్కరణలను ప్రవేశపెట్టిన గొప్ప మేధావి, బహుభాషా కోవిదుడు, మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నరసింహారావు అని తెలంగాణ గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్ కొనియాడారు. సోమవారం రవీంద్ర భారతిలో తెలంగాణ సాహిత్య అకాడమీ, తెలుగు భాషా చైతన్య సమితి సంయుక్త ఆధ్వర్యంలో భారతరత్న పీవీ నరసింహారావు 105వ జయంతి సభ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ రియాజ్ మాట్లాడుతూ.. పీవీ నరసింహారావు అసమాన జ్ఞాన సంపన్నుడని కొనియాడారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 'వందేమాతరం' నినాదానికి నిజాం ప్రభుత్వం నిరాకరించినప్పుడు, ఆ ఉద్యమాన్ని ముందుండి నడిపి, అక్కడి నుండి నిష్క్రమించి నాగపూర్‌లో విద్యనభ్యసించి సమాజాన్ని చైతన్యపరిచిన ధీశాలి పీవీ అని గుర్తుచేశారు. ఆయన దేశానికి చేసిన సేవలు అమూల్యమైనవని, పీవీ ప్రవేశపెట్టిన ఆర్థిక, సామాజిక సంస్కరణలను నేడు ప్రపంచ దేశాలన్నీ అనుసరిస్తున్నాయని, ఇది తెలంగాణ బిడ్డ యొక్క గొప్పతనానికి నిదర్శనమని చాటారు.





**సాహిత్య రంగానికి పీవీ సేవలు అనన్యం...**

మరో విశిష్ట అతిథి, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ ఎన్. బాలాచారి మాట్లాడుతూ.. రాజకీయాలకే పరిమితం కాకుండా పీవీ నరసింహారావు సాహిత్య రంగానికి ఎనలేని సేవ చేశారన్నారు. అనేక భాషలపై పట్టు సాధించిన ఆయన, విశ్వనాథ సత్యనారాయణ రాసిన ప్రసిద్ధ నవల 'వేయి పడగలు'ను హిందీలోకి 'సహస్ర ఫణి' పేరుతో అద్భుతంగా అనువదించారని కొనియాడారు. ప్రజాకవి కాళోజీ నారాయణరావుతో పీవీకి ఉన్న ఆత్మీయ బంధాన్ని గుర్తుచేస్తూ.. నిరంతరం సాహిత్య సేవలోనే గడిపిన వ్యక్తిత్వం ఆయనదన్నారు. నెహ్రూ ప్రపంచ శాంతి ఆలోచనలనే పీవీ సైతం ముందుకు తీసుకెళ్లారని, దేశంలో టెక్నాలజీ విప్లవానికి నాంది పలికారని పేర్కొన్నారు.

**మైనార్టీ ప్రభుత్వాన్ని నడిపిన చాణక్యుడు...**

కార్యక్రమానికి సభాధ్యక్షత వహించిన ప్రముఖ కవి, విమర్శకులు శ్రీ రామకృష్ణ చంద్రమౌళి మాట్లాడుతూ.. సంక్షోభ సమయాల్లో మైనార్టీ ప్రభుత్వాన్ని పూర్తి కాలం విజయవంతంగా నడిపిన అపర చాణక్యుడు పీవీ నరసింహారావు అని కొనియాడారు. తెలుగు భాషా చైతన్య సమితి అధ్యక్షులు పి. బడే సాబ్ పర్యవేక్షణలో జరిగిన ఈ సభలో.. విశిష్ట అతిథులుగా సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞ శర్మ, శ్రీ సంగం రామేశ్వరయ్య, ఈఎస్టీ డాక్టర్ రవి శంకర్ ప్రజాపతి, శ్రీమతి పాలడుగు సరోజినీ దేవి, శ్రీ రాధా కుసుమ కుసుమధర్మన్న, చైర్పర్సన్ సత్యనారాయణ స్వామి తదితరులు పాల్గొని పీవీ చిత్రపటానికి నివాళు లర్పించారు. ఈ సభకు పెద్ద సంఖ్యలో సాహితీప్రియులు, కవులు, మేధావులు హాజరయ్యారు.

# కరెంటు తీగలపై ఉన్న చెట్ల కొమ్మలను తొలగించిన బిఆర్ఎస్ అధ్యక్షుడు తోట మహేష్ యాదవ్



**చైతన్యపురి, జూన్29 (నేటి దర్శిని):** చైతన్యపురి డివిజన్ పరిధిలోని మారుతీనగర్‌లో బాబు కాంప్లెక్స్ సమీపంలో విద్యుత్ తీగలకు ఆనుకుని ప్రమాదకరంగా ఉన్న చెట్ల కొమ్మలను సోమవారం తొలగించారు. రానున్న వర్షాకాలంలో విద్యుత్ అంతరాయాలు, ప్రమాదాలు సంభవించే అవకాశం ఉండటంతో ముందస్తు జాగ్రత్త చర్యగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో చైతన్యపురి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు తోట మహేష్ యాదవ్, జీహెచ్ఎంసీ సూపర్వైజర్ అజయ్ సమక్షంలో చెట్ల కొమ్మలను తొలగించే పనులు నిర్వహించారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ఇటువంటి నివారణ చర్యలు చేపట్టడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రియాన్ష్ యాదవ్ జన్మదినం సందర్భంగా పేద విద్యార్థులకు అల్పాహారం

● శ్రీ కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా జన్మదిన వేడుకలు

**ఎల్.బి.నగర్, జూన్ 29 (నేటి దర్శిని):** శ్రీ కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో సమితి ఎగ్జిక్యూటివ్ సభ్యుడు సతీష్ యాదవ్ కుమారుడు మాస్టర్ రియాన్ష్ యాదవ్ జన్మదినాన్ని పురస్కరించుకుని పేద పిల్లల పాఠశాలలో అల్పాహార సేవా కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 250 మంది పేద విద్యార్థులకు శుభ్రమైన, రుచికరమైన, పోషకాహారంతో కూడిన అల్పాహారాన్ని అందజేశారు. అనంతరం చిన్నారుల సమక్షంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఆనందోత్సాహాల



మధ్య నిర్వహించారు. విద్యార్థులు మాస్టర్ రియాన్ష్ యాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా మండలి సభ్యులు, కృష్ణ గోపాల్ సేవా సమితి అధ్యక్షులు డా. కపిల్ కుమార్ అగర్వాల్, సమితి అధికారులు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు పాల్గొన్నారు. వారు మాస్టర్ రియాన్ష్ యాదవ్‌కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ,



ఆయురారోగ్యాలు, విద్యలో ఉన్నత విజయాలు, సుఖసంతోషాలు కలగాలని భగవంతుణ్ని ప్రార్థించారు. ఈ సందర్భంగా సమితి ప్రతినిధులు మాట్లాడుతూ, "మానవ సేవే మాధవ సేవ" అనే మహోన్నత ఆశయంతో శ్రీ కృష్ణ గోపాల్ సేవా సమితి నిరంతరం అన్నదానం, అల్పాహార పంపిణీ, విద్యార్థులకు సేవా కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు.

# సీఎం సభకు ఏర్పాట్లపై అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన..

● అన్ని శాఖల సమన్వయంతో చర్యలు





**మిడ్జిల్ జూన్ 29( నేటి దర్శిని ప్రతినిధి ):** మిడ్జిల్ మండల కేంద్రంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా నిర్వహించనున్న బహిరంగ సభతో పాటు మాజీ జడ్పీ చైర్మన్ ద్యాప గోపాల్‌రెడ్డి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాల ఏర్పాట్లు వేగం పుంజుకున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం జిల్లా ఉన్నతాధికారులు మిడ్జిల్‌లో పర్యటించి సభా వేదికతో పాటు విగ్రహావిష్కరణ స్థలాలను క్షుణ్ణంగా పరిశీలించారు.

అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, ఆర్డీవో నవీన్ కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఆర్ అండ్ బీ డీఈ సంధ్య, సీఐలు నాగార్జునగౌడ్, మోతిరాం, మహేష్, ఎస్సై శ్రీనివాస్ యాదవ్, తహసీల్దార్ రాఘవేందర్ రెడ్డి, ఎంపీవో రాజశేఖర్ రెడ్డి, సర్వేయర్ నరేంద్ర తదితరులు సభా ప్రాంగణం, మిడ్జిల్ బస్టాండ్ పరిసర ప్రాంతాలు, విగ్రహావిష్కరణ స్థలాలను సందర్శించి చేపట్టాల్సిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు.

సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ మళ్లింపు, వాహనాల పార్కింగ్, తాగునీటి వసతి, విద్యుత్, పారిశుధ్యం, వైద్య సదుపాయాలు, బారికేడింగ్, భద్రతా ఏర్పాట్లు, వీఐపీ రాకపోకలు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమగ్రంగా చర్చించారు. ప్రతి శాఖ తనకు అప్పగించిన బాధ్యతలను సకాలంలో పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు.

గ్రామ సర్పంచ్ ఎడ్ల శంకర్, ఉపసర్పంచ్ మమత మన్యం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అల్వాల్ రెడ్డి, నాయకులు వెంకటయ్య, బాల్‌రెడ్డి, గౌస్, సాయులు, శ్యాంసుందర్ రెడ్డి, సత్యం గుప్తా, ప్రశాంత్ రెడ్డి, మల్లికార్జున్ రెడ్డి, సంపత్ కుమార్, కృష్ణయ్య గౌడ్, శ్రీనివాస్ నాయక్, రాముగౌడ్, బాలయ్య, నరేందర్ రెడ్డి, రాజునాయక్ తదితరులు అధికారులతో కలిసి కార్యక్రమాల నిర్వహణకు అనువైన ప్రాంతాలను చూపించి స్థానిక పరిస్థితులను వివరించారు.

ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని, ఎలాంటి లోపాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని అధికారులు తెలిపారు. సీఎం సభ విజయవంతానికి మిడ్జిల్ ఇప్పటికే సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోందని పేర్కొన్నారు.

## 7సీ ఫిట్‌నెస్ క్లబ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి




**హయత్‌నగర్, జూన్ 29 (నేటి దర్శిని):** ఉమ్మడి హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని అరుణోదయ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన 7సి ఫిట్‌నెస్ క్లబ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువత ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవడానికి ప్రతిరోజూ వ్యాయామం చేయడం, ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యత ఇవ్వడం ఎంతో అవసరమని అన్నారు. ప్రస్తుత కాలంలో ఆరోగ్య సంరక్షణలో ఫిట్‌నెస్ సెంటర్లు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో ఇటువంటి ఫిట్‌నెస్ క్లబ్‌లు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. అలాగే 7సి ఫిట్‌నెస్ క్లబ్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఈ కేంద్రం ద్వారా స్థానిక ప్రజలకు నాణ్యమైన ఫిట్‌నెస్ సేవలు అందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు గంగాని శ్రీనివాస్, నాయకుడు ఇట్టబోయిన నర్సింహా, స్థానిక నాయకులు, యువకులు, కాలనీ వాసులు, క్లబ్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## ఏయం మెన్స్ వేర్ ఘన ప్రారంభం



**వనస్థలిపురం, జూన్ 29 (నేటి దర్శిని):** వనస్థలిపురం భాగ్యలత కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన "ఏయం మెన్స్ వేర్" దుస్తుల దుకాణాన్ని ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హైదరాబాద్ ఈగల్ టీం సభ్యుడు ఫయాజ్ భాయ్ ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి జ్యోతి ప్రజ్వలన చేసి దుకాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫయాజ్ భాయ్ మాట్లాడుతూ, వినియోగదారులకు నాణ్యమైన పురుషుల దుస్తులను అందుబాటు ధరల్లో అందించాలనే లక్ష్యంతో ఏయం మెన్స్ వేర్ ప్రారంభించడం అభినందనీయమన్నారువ్యాపార రంగంలో కొత్తగా అడుగుపెడుతున్న యజమానులు విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు, వ్యాపారులు, కాలనీవాసులు, కుటుంబ సభ్యులు పాల్గొని నూతన దుకాణ యజమానులకు శుభాకాంక్షలు తెలిపారు.

## కలెక్టరేట్ ను ముట్టడించిన 15 గ్రామాల ప్రజలు

● ప్రజలకు మద్దతు తెలిపిన బీఆర్ఎస్, బిజెపి, కమ్యూనిస్టులు, ప్రజా సంఘాలు, కాంగ్రెస్, బీఎస్పీ, ఇతర పార్టీలు






**రంగారెడ్డి,జూన్29(నేటి దర్శిని):** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అబ్దుల్లాపూర్మెట్ మండలం బండరావిరాల గ్రామ సరిహద్దు ప్రాంతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుచేతలపెట్టిన మురికి కూపం డంపింగ్ యార్డు (ఎకో టౌన్ ప్రాజెక్టు)కు వ్యతిరేకంగా మండల పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలు సోమవారం ఆందోళన బాట పట్టారు. సోమవారం అబ్దుల్లాపూర్ మెట్టు మండలం బండరావిరాల గ్రామ సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో దాదాపు 15 గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు భారీ సంఖ్యలో రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్దకు చేరుకొని భారీ జన సమూహంతో ముట్టడించారు. ఈ సందర్భంగా ఆందోళనలో భాగస్వామ్యమైనటు వంటి ప్రజలు డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసన, ఆందోళన కార్యక్రమానికి వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు మద్దతు మద్దతు తెలపడమే కాకుండా ప్రత్యక్ష ఆందోళనలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్, కమ్యూనిస్టు, బీఎస్పీ పార్టీలకు చెందిన స్థానిక నాయకులు రాజకీయాలకు అతీతంగా ప్రజల పక్షాన ఆందోళన బాట పట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, దాసోజు శ్రవణ్, టిఆర్ఎస్ పార్టీ యాదాద్రి భువనగిరి పార్లమెంట్ ఇంచార్జ్ క్యామ మల్లేష్ కురుమ, పలువురు ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే డంపింగ్ యార్డు ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. అబ్దుల్లాపూర్ మెట్టు మండల ఉనికికే ప్రమాదకరంగా మారినటువంటి డంప్ యార్డ్ ను ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించారని, సమస్య పరిష్కారం కాకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. ఈ అంశంలో ప్రజా సేకరణ చేయాలని, ప్రజలకు వ్యతిరేకంగా చేపట్టబోయే డంప్ యార్డ్ ను ఎట్టి పరిస్థితిలో అడ్డుకొని తీరుతామన్నారు. రాబోవు రోజుల్లో అవసరమైతే ప్రజలతో కలిసి సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. జిల్లాలోనే అత్యంత ఖరీదు అయినటువంటి ప్రాంతంగా ఉన్నటువంటి అబ్దుల్లాపూర్ మెట్టు మండలంలో ప్రభుత్వం డంపు యార్డ్ ఏర్పాటు చేస్తామన్నం ఈ అంశాలను పరిగణలోకి తీసుకున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా డంపింగ్ యారు ఏర్పాటు ఉపసంహరించుకోవాలని వారు స్పష్టం చేశారు. ఇప్పటికే మండల పరిధిలోని పిల్లాయిపల్లి, బాచారం, బండరావిరాల, చిన్నరావిరాల, పెద్దగూడెం తదితర గ్రామాల ప్రజలు ఇప్పటికే మూసీ కాలుష్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న తీరు ప్రభుత్వానికి పట్టదా అని వారు ప్రశ్నించారు. ఉన్నటువంటి సమస్యలతోనే మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న తరుణంలో డంప్ యార్డును ఏర్పాటు చేస్తామండలం సరైన విధానం కాదని వారు హితవు పలికారు. డంపింగ్ యార్డు భారాన్ని మోపడం అన్యాయమని, మైనింగ్ జోన్ కారణంగా నష్టపోయిన బాధితులకు తగిన నష్టపరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఆందోళన అనంతరం జిల్లా ప్రజావాణిలో అదనపు కలెక్టర్ చంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, బండరావిరాల సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్, చిన్నరావిరాల సర్పంచ్ పబ్బత్ బాలకిషన్ గౌడ్, పిల్లాయిపల్లి సర్పంచ్ పెరుమాళ్ల మహాలక్ష్మి దానయ్య, దేశముఖి సర్పంచ్ దుర్గం జంగయ్య యాదవ్, జగత్పల్లి సర్పంచ్ ఇట్టమోని మహేష్ యాదవ్, పెద్దగూడెం సర్పంచ్ నర్సిరెడ్డి, కవాడిపల్లి సర్పంచ్ కొలను ప్రసన్నలక్ష్మి రవీందర్ రెడ్డి, బలిజగూడ సర్పంచ్ కొప్పు మాధవినవీన్, మాజీ సర్పంచ్లు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, యువకులు పెద్ద సంఖ్యలో ప్రజా సంఘాల నాయకులు, వివిధ పార్టీల నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## పాలెం తండా పాఠశాలకు రూ.3 వేల విరాళం

● నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేసిన మాజీ ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ రెడ్డి



**చింతపల్లి, జూన్ 29 (నేటి దర్శిని):** చింతపల్లి మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మండల విద్యాశాఖ అధికారి నీరుడు అంజయ్య పిలుపునిచ్చారు. చింతపల్లి మండలంలోని పాలెం తండా ప్రాథమిక ప్రభుత్వ పాఠశాల గత రెండు సంవత్సరాలుగా విద్యార్థులు లేక మూతపడగా, ఇటీవల మళ్లీ ప్రారంభమైంది. పాఠశాల పునఃప్రారంభం అనంతరం 15 నుంచి 20 మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లకుండా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోనే చేరేందుకు ముందుకు రావడం విశేషం. ఈ సందర్భంగా గతంలో ఆ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన పున్ రెడ్డి సుధాకర్ రెడ్డి రూ.3 వేల విలువైన నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల సంఖ్య మరింత పెరిగితే పాఠశాల అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నేనావత్ లక్ష్మి, ప్రధానోపాధ్యాయురాలు సుగుణ, కాంగ్రెస్ పార్టీ నాయకుడు నేనావత్ దశరథ్ నాయక్, గ్రామ పెద్దలు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల హక్కుల సాధనకు జూలై 2న ఉప్పల్ భగాయత్‌లో మహా నిరసన

● 250 గజాల స్థలాల హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్
● ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలకు ఎన్నికల హామీలు నెరవేర్చాలని విజ్ఞప్తి
● భారీ సంఖ్యలో హాజరై నిరసనను విజయవంతం చేయాలని పిలుపు
● తెలంగాణ రక్షణ సేన ఆలేరు నియోజకవర్గ ఇన్చార్జ్ కందాడి మణిపాల్ రెడ్డి



**ఆలేరు, జూన్ 29 (నేటి దర్శిని):** తెలంగాణ స్వరాష్ట్ర ఉద్యమకారుల హక్కుల సాధన కోసం జూలై 2న ఉప్పల్ భగాయత్‌లో నిర్వహించనున్న మహా నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ రక్షణ సేన ఆలేరు నియోజకవర్గ నాయకుడు కందడి మణిపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఆలేరు పట్టణంలోని రహదారి బంగ్లా వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన 250 గజాల స్థలాలను వెంటనే కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలకు ఇచ్చిన అన్ని ఎన్నికల హామీలను ప్రభుత్వం ఆలస్యం చేయకుండా అమలు చేయాలని కోరారు. తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేయడంతో పాటు వారి హక్కులను పరిరక్షించడంలో తెలంగాణ రాష్ట్ర పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో నిరుద్యోగం, రైతులు, మహిళలు, ఉద్యమకారుల సమస్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని విమర్శించారు. జూలై 2న ఉప్పల్ భగాయత్‌లో నిర్వహించే నిరసన కార్యక్రమానికి తెలంగాణ ఉద్యమకారులు, యువత, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర పార్టీ నాయకులు గోపాల్, విజయ్, వెంకటేష్, మహేష్, సురేష్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# సీతాఫల్‌మండి టి.ఆర్.టీ కాలనీలో అక్రమ నిర్మాణాలు..?

- జోనల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారుల మౌనం వెనుక మర్మమేంటి.?
- అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతోందని స్థానికుల ఆరోపణలు
- ఫిర్యాదులు ఉన్న అధికారుల చర్యలు ఎందుకు లేవని ప్రశ్నలు
- వర్క్ ఆపాలని నోటీసులు ఎక్కడ.? మున్సిపల్ చట్టం అందరికీ ఒకటే కాదా.?
- విజిలెన్స్ విచారణ చేపట్టి వాస్తవాలు వెల్లడించాలని స్థానికుల డిమాండ్

**హైదరాబాద్,జూన్29(నేటి దర్శిని):** సీతాఫల్‌మండి టిఆర్ టి కాలనీలో జరుగుతున్న ఓ అక్రమ నిర్మాణం ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ నిర్మాణం అనుమతులకు పూర్తి విరుద్ధంగా కొనసాగుతోందని స్థానికులు ఆరోపిస్తూ టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ, ఇప్పటివరకు కనీస చర్యలు కనిపించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. దీంతో సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ కార్యాలయం, టౌన్ ప్లానింగ్ అధికారులు ఎందుకు మౌనం పాటిస్తున్నారనే ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. ఒకవేళ నిర్మాణం చట్టబద్ధంగా జరుగుతుంటే ఆ విషయాన్ని ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని, నిర్మాణదారుడు నిబంధనల ఉల్లంఘనలు ఉంటే వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అయితే స్థానికుల ఫిర్యాదులు ఉన్నప్పటికీ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయనే ఆరోపణలు అధికారులు అమ్ముడుపోయారనే సందేహాలను పెంచుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. సాధారణంగా అక్రమ నిర్మాణాలపై జిహెచ్ఎంసి నిబంధనల ప్రకారం స్టాప్ వర్క్ నోటీసులు, షోకాష్ నోటీసులు అవసరమైతే సీజ్ నోటీసులు జారీ చేయాల్సి ఉంటుంది. కానీ ఈ అక్రమ నిర్మాణం విషయంలో అలాంటి చర్యలు తీసుకున్నారా.? లేదా.? లేకుంటే ఎందుకు తీసుకోలేదు.? అక్రమ నిర్మాణదారులతో చేతులు కలిపి లంచాలు తీసుకున్నారా.? అనే విషయంపై అధికారుల నుంచి ఎలాంటి స్పష్టత లేకపోవడం విమర్శలకు దారితీస్తోంది. ఒకవేళ నోటీసులు జారీ చేసి ఉంటే వాటి వివరాలను బహిర్గతం చేయాలని, చేయకపోతే కారణాలను వెల్లడించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

తెలంగాణ ప్రభుత్వం అక్రమ నిర్మాణాలను ఉపేక్షించబోమని పలుమార్లు ప్రకటించింది. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ పెద్దలు చెబుతున్న నేపథ్యంలో ఈ అక్రమ నిర్మాణంపై కూడా అదే ప్రమాణాలు అమలు అవుతున్నాయా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సాధారణ ప్రజల విషయంలో వెంటనే చర్యలు తీసుకుంటూ బడా బాబుల, బిల్డర్ల విషయంలో అధికారులు కావాలనే ఆలస్యం చేస్తున్నారని భావన ప్రజల్లో ఏర్పడితే కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనపై విశ్వాసం దెబ్బతినే ప్రమాదం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

సికింద్రాబాద్ జోనల్ కమిషనర్, జోనల్ సిపి, టౌన్ ప్లానింగ్ అధికారులు ఈ నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, ఆమోదిత ప్రణాళిక, స్థల పరిశీలన నివేదిక, ఇప్పటివరకు



తీసుకున్న చర్యల వివరాలను ప్రజలకు పత్రికా ముఖంగా వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు. నిర్మాణదారుడు చట్ట



ఉల్లంఘనలు ఉన్నట్లు తేలితే ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. సీతాఫల్‌మండి టి ఆర్ టి కాలనీలో జరుగుతున్న ఈ భారీ అక్రమ నిర్మాణంపై స్టేట్ విజిలెన్స్ అధికారులు చే సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను ప్రజలకు తెలియజేసి అక్రమ నిర్మాణం అని తేలితే కూల్చివేతలు చేసి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత తార్నాక సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులపై ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

## సత్వర పరిష్కారమే లక్ష్యం

- అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్
- ప్రజావాణి అర్జీలకు సత్వర పరిష్కారం కల్పించాలి
- అధికారులకు అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ ఆదేశం



**సిద్దిపేట,జూన్ 29 (నేటి దర్శిని):** ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులను అత్యంత ప్రాధాన్యంతో తీసుకుని సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీకిరణ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 162 దరఖాస్తులు వివిధ సమస్యలపై అందినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం అధికారులపై నమ్మకంతో ప్రజావాణి కార్యక్రమానికి వస్తారని పేర్కొన్నారు. అందువల్ల ప్రతి దరఖాస్తును బాధ్యతాయుతంగా పరిశీలించి, సంబంధిత శాఖలు వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కాలువలో పేరుకుపోయిన మట్టిని తొలగించాలి...

**మందమర్రి జూన్ 29 (నేటి దర్శిని):** మందమరి మార్కెట్ మజీద్ నుండి మొదలైన కాలువ రెండవ జూన్ మీదుగా శ్రీపతి నగర్ వద్ద ఉన్న పెద్ద డ్రైనేజీలో కలుస్తుంది కాగా గత కొన్ని సంవత్సరాలు క్రితం నిర్మించిన ఈ కాలువలో చెత్తాచెదారం మట్టితో కాల్వ మొత్తం నిండిపోవడం జరిగింది. వర్షాకాలం కావడంతో మార్కెట్ నుండి వచ్చే నీరు కాలువలు మట్టి ఉండడం వల్ల నీరు వెళ్లడం లేదు. ముఖ్యంగా కార్మికుల కాలనీలలోని వరద నీరు వచ్చి ఇదే కాలువలో చేరుతుంది చిన్నపాటి వర్షానికి డ్రైనేజీ కాలువలోకి వీధుల నుండి వచ్చే నీరు సక్రమంగా వెళ్లాక కార్మికుల ఇళ్లలోకి నీరు వస్తుందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఆ డ్రైనేజీ కాలువలో పూడికలు తీయకపోవడంతో మట్టి చెత్త చెదారం పేరుకుపోయి ఉంది ఇప్పటికైనా సింగరేణి అధికారులు స్పందించి ఆ డ్రైనేజీ కాలువలోని మట్టిని పూడికతీత ద్వారా తొలగించాలని కార్మికులు స్థానికులు, అధికారులను కోరుతున్నారు.

## ఉచిత టిఫిన్, టీ లు పోలీసులకేనా..?

- టిఫిన్, టీ లు తినడమే కాదు పార్సల్లు కూడా తీసుకెళ్తున్నారని ఆవేదన
- హోటల్, టిఫిన్, టీ స్టాల్ నిర్వాహకుల ఆవేదన వర్ణనాతీతం
- డబ్బులు అడగలేము, అడిగితే తర్వాత వేధింపులు తట్టుకోలేము అంటున్న నిర్వాహకులు
- రోడ్లు, ఫుట్ పాత్ లపై నిర్వహిస్తున్న ఫుడ్ సెంటర్లకు నెల నెల మామూళ్లు ఇవ్వాల్సిందే
- డిజిపి సివి ఆనంద్ స్పందించాలి, పరిస్థితి మార్చాలని నిర్వాహకుల విన్నపం

**హైదరాబాద్,జూన్29 (నేటి దర్శిని):** హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ లోని సికింద్రాబాద్ జోన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న కొంతమంది పెట్రోకార్, బ్లూ కోట్స్ పోలీసుల వ్యవహార శైలిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విధుల్లో భాగంగా ఆయా పోలీస్ స్టేషన్ ల పరిధిలో పెట్రో కార్ వాహనం, బ్లూ కోట్స్ వాహనం (ద్విచక్ర )పై గస్తీ నిర్వహిస్తున్న కొంతమంది పోలీసు సిబ్బంది హోటళు ,,టిఫిన్, టీ సెంటర్లకు వెళ్లి ఉచితంగా టిఫిన్లు తింటున్నట్లు విమర్శలు వస్తున్నాయి. సాధారణ ప్రజల మాదిరిగా డబ్బులు చెల్లించి హోటళ్లలో, టిఫిన్, టీ సెంటర్లలో అల్పాహారాన్ని కొనుగోలు చేసి తినాలని పోలీస్ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసిన క్షేత్రస్థాయి పోలీసులు మాత్రం ఈ ఆదేశాలను పాటించడం లేదనే విమర్శలు ఉన్నాయి. ప్రధానంగా



ఆయా ఏరియాల్లోని హోటళ్లు,టిఫిన్. టీ సెంటర్లు నిర్వాహకులు తమకు ఉచితంగా ఇడ్లీ, వడ, పూరి, దోశ, టీ లాంటి టిఫిన్లు ఇవ్వాలంటూ పెట్రోకార్, బ్లూ కోర్ట్స్ పోలీసులు హుకుం జారీ చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. దానికి తోడు పార్సల్లు కూడా భారీ స్థాయిలో తీసుకెళ్తున్నారని ఇక ఫుట్పాత్, రోడ్లపై పెట్టే స్ట్రీట్ ఫుడ్, టిఫిన్, టీ సెంటర్ల నిర్వాహకులు ఉచితంగా ఇవ్వాలి లేదా ప్రతినెల మామూళ్లు కచ్చితంగా ఇవ్వాలన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతిరోజు ఉదయం వేళల్లో ఆయా హోటళ్లు, టిఫిన్ సెంటర్లకు యూనిఫామ్ ధరించి వెళ్తున్న పోలీస్ సిబ్బంది డబ్బులు ఇవ్వకుండనే ఉచితంగా టిఫిన్లు తింటున్నట్లు నిర్వాహకుల ఆరోపణలు ఉన్నాయి. కస్టమర్ల మాదిరిగా కౌంటర్ పై డబ్బులు చెల్లించి టోకెన్ తీసుకోకుండా సదరు పోలీస్ సిబ్బంది నేరుగా వెళ్లి టిఫిన్లు తీసుకొని తింటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అసలే ప్రస్తుత పరిస్థితుల్లో గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగిపోయి తమ వ్యాపారాలు సరిగా నడవక ఇబ్బంది పడుతున్న తరుణంలో క్షేత్రస్థాయి పోలీసులు తమ వద్ద ఉచితంగా అల్పాహారం, టీలు, భోజనాలు తినడం, పార్సల్లు తీసుకొని వెళ్లడం, వలన తాము తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తే తమని టార్గెట్ వ్యాపారం నిర్వహించుకోకుండా వేధింపులకు గురి చేస్తారని కొంతమంది నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారు అడిగిన టిఫిన్లు ఇవ్వని పక్షంలో సమయం చూసి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. హోటళ్లు, టిఫిన్ సెంటర్లతోపాటు తోపుడు బండ్లపై పండ్లు, అల్పాహారాన్ని విక్రయిస్తున్న వారిని కూడా క్షేత్రస్థాయి పోలీసులు వదలడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. చిరు వ్యాపారుల వద్ద కూడా కొంతమంది పోలీసులు ఉచితంగా టిఫిన్ పార్సిల్ లు తీసుకొని వెళ్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పోలీసులు అడిగిన వాటిని ఉచితంగా ఇవ్వకుంటే చీటికిమాటికి వారి బండ్ల వద్దకు వచ్చి కేసుల పేరుతో బెదిరింపులకు గురి చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ప్రధానంగా జోన్ పరిధిలోని నల్లకుంట, కాచిగూడ, చిలకలగూడ, చిక్కడపల్లి, దోమలగూడ, రాంగోపాల్ పేట్, మహంకాళి, ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ల పరిధిలో విధులు నిర్వహిస్తున్న కొంతమంది పెట్రో కార్, బ్లూ కోర్స్ పోలీస్ సిబ్బంది పై ఇలాంటి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి హోటళ్లు, టిఫిన్ సెంటర్ ల నిర్వాహకులను, చిరు వ్యాపారులను ఉచిత టిఫిన్ల పేరుతో వేధింపులకు గురి చేస్తున్న సదరు పోలీసు సిబ్బందిపై పూర్తిస్థాయి విచారణ చేయించి, హోటళ్ల సీసీ ఫుటేజ్ లను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

## సర్ ప్రక్రియ పారదర్శకంగా సాగేలా చూడాలి...

- ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి...

**నాగారం, జూన్ 29:- (నేటి దర్శిని):** భారత ఎన్నికల సంఘం చేపట్టిన “సర్” సాఫీగా సాగేలా చూడాలని ఉప్పల్ కాంగ్రెస్ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి సోమవారం ఉప్పల్ డివిజన్ పరిధిలోని భరత్ నగర్‌లో విస్తృతంగా పర్యటించి క్షేత్ర స్థాయిలో “సర్” ప్రక్రియ తీరును పరిశీలించారు. కాలనీలలో విధులు నిర్వహిస్తున్న బూత్ స్థాయి అధికారులను (బీఎల్ఓలు) కలిసి ‘సర్’ ప్రక్రియ ఏ విధంగా జరుగుతోంది, నమోదు మరియు మార్పుల ప్రక్రియ ఎక్కడివరకు వచ్చింది, ప్రజల నుంచి ఎలాంటి స్పందన వస్తోంది అనే విషయాలను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిజమైన ప్రతి ఓటరుకు ఈ ప్రక్రియతో అన్యాయం జరుగకుండా



చూడాలని, ఎలాంటి లోపాలు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని బీఎల్ఓలకు సూచించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంటింటికీ తిరుగుతున్న బూత్ స్థాయి అధికారులను (బీఎల్ఓలను) కలిసి, భరత్ నగర్‌లో సర్వే ఏ విధంగా జరుగుతోందో అడిగి తెలుసుకున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అనేది సామాన్యుడికి ఉన్న అతిపెద్ద ఆయుధమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ శ్రేణులు ఈ ప్రక్రియలో పూర్తి బాధ్యతతో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా అర్హులైన, నిజమైన ఒక్క ఓటరు పేరు కూడా పొరపాటున ఓటర్ల జాబితా నుండి తొలగిపోకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి అక్రమాలు, బోగస్ ఓట్లు లేకుండా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఈ సర్ సవరణ ప్రక్రియ జరగాలని డిమాండ్ చేశారు. ఓటర్ల సవరణ లేదా కొత్తగా నమోదు చేసుకునే ప్రక్రియలో సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వారికి సులభంగా అవగాహన కల్పించేలా మన బూత్ లెవల్ ఏజెంట్లు (బిఎల్ఎలు) సహాయపడాలని సూచించారు.

## వైజాగ్ వేదికగా నేడు

# లెనిన్ ట్రైలర్ విడుదల




అక్కినేని అఖిల్ అభిమానులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న మాస్ కంబ్యాక్ మూవీ 'లెనిన్' ఇప్పుడు ప్రమోషన్స్‌లో వేగం పెంచింది. దర్శకుడు మురళీ కిషోర్ అబ్బూరు తెరకెక్కిస్తున్న ఈ మాస్ యాక్షన్ డ్రామాపై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొనగా, తాజాగా ట్రైలర్ లాంచ్‌కు సంబంధించిన అప్‌డేట్ సినిమాపై మరింత హైప్‌ను పెంచుతోంది. చిత్ర బృందం 'లెనిన్' థియేట్రికల్ ట్రైలర్‌ను జూన్ 30న విశాఖపట్నంలో గ్రాండ్‌గా విడుదల చేయాలని నిర్ణయించింది. సాయంత్రం 4 గంటలకు నగరంలోని ప్రముఖ శరత్ థియేటర్‌లో ఈ ఈవెంట్ జరగనుంది. ట్రైలర్ లాంచ్ కోసం ఇప్పటికే భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. అఖిల్ అభిమానులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమానికి హాజరయ్యే అవకాశం కనిపిస్తోంది. ఈ సందర్భంగా విడుదల చేసిన కొత్త పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పోస్టర్‌లో అఖిల్ పూర్తిస్థాయి రస్టిక్ లుక్‌లో సైకిల్ తొక్కుతూ కనిపించడం అభిమానులను ఆకట్టుకుంటోంది. 'ఏజెంట్' తర్వాత అఖిల్ నుంచి వస్తున్న ఈ సినిమా ఆయన కెరీర్‌కు కీలకంగా మారనుంది. చాలా కాలంగా సరైన హిట్ కోసం ఎదురుచూస్తున్న అఖిల్, ఈసారి పూర్తిస్థాయి మాస్ యాక్షన్ కథను ఎంచుకోవడం విశేషం. ఈ చిత్రంలో అఖిల్ సరసన యువ నటి భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. వీరిద్దరి కెమిస్ట్రీ కూడా సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని చిత్ర యూనిట్ చెబుతోంది. ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ఈ సినిమాను అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, మనం ఎంటర్‌ప్రైజెస్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. భారీ నిర్మాణ విలువలతో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి సంగీత దర్శకుడు ఎస్. థమన్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, పాటలపై మంచి అంచనాలు నెలకొన్నాయి. జూలై 10న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానున్న 'లెనిన్' చిత్రం అఖిల్ కెరీర్‌లో అత్యంత కీలకమైన సినిమాగా భావిస్తున్నారు.

# ఇరుముడి కట్టు'తో భక్తి సంద్రంలో రవితేజ..

## ఫస్ట్ సాంగ్‌కు అద్భుతమైన స్పందన




మాస్ మహారాజా రవితేజ హీరోగా దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న డివోషనల్ థ్రిల్లర్ 'ఇరుముడి' సినిమాపై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ సినిమా నుంచి విడుదలైన తొలి పాట 'ఇరుముడి కట్టు' ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. అయ్యప్ప స్వామి భక్తి నేపథ్యంలో రూపొందిన ఈ గీతం భక్తి భావాలను మళ్లీ మళ్లీ గుర్తు చేసేలా ఉండటంతో సోషల్ మీడియాలో మంచి స్పందనను సొంతం చేసుకుంది. సోమవారం (జూన్ 29) చిత్ర బృందం విడుదల చేసిన ఈ లిరికల్ వీడియోలో రవితేజ భక్తి పారవశ్యంలో మునిగిపోయిన తీరు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 'స్వామియే శరణం అయ్యప్ప' అంటూ ప్రారంభమయ్యే ఈ పాట, చివరి వరకు భక్తి రసాన్ని కొనసాగిస్తూ శ్రోతలను అలరిస్తోంది.పాటలో అయ్యప్ప మాలధారణలో కనిపించిన రవితేజ, భక్తి భావాలతో నిండిన స్టెప్పులు వేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఆయన లుక్, ఎక్స్‌ప్రెషన్స్, పాట చిత్రీకరణకు సంబంధించిన విజువల్స్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచాయి. విడుదలైన కొద్ది గంటల్లోనే ఈ పాట సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే సినిమాలో రెండు అయ్యప్ప స్వామి భక్తి గీతాలు ఉంటాయని ఆయన వెల్లడించారు. అందులో భాగంగా విడుదలైన తొలి పాటకు సంగీతం, ఆర్కెస్ట్రేషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ గీతాన్ని గాయకుడు అనంతు తన స్వరంతో అద్భుతంగా ఆలపించారు. పాట సాహిత్యాన్ని దర్శకుడు శివ నిర్వాణ, రచయిత కళ్యాణ్ చక్రవర్తితో కలిసి రాయడం విశేషం. దర్శకుడిగానే కాకుండా మంచి సాహిత్యకారుడిగా కూడా శివ నిర్వాణ మరోసారి తన ప్రతిభను చాటుకున్నారు. డివోషనల్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న 'ఇరుముడి' సినిమాలో భక్తి, భావోద్వేగాలు, థ్రిల్ అంశాలు సమపాళ్లలో ఉండనున్నాయని సమాచారం. ఫస్ట్ సాంగ్‌కు వస్తోన్న స్పందనను చూస్తుంటే సినిమా సంగీతం కూడా ప్రధాన ఆకర్షణగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే 'ఇరుముడి కట్టు' పాట భక్తుల్లో ప్రత్యేక ఆదరణ పొందుతుండగా, రాబోయే రోజుల్లో సినిమా నుంచి వచ్చే ఇతర అప్‌డేట్స్‌పై కూడా అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# 'నో' చెప్పడం నేర్చుకోండి


ప్రతిభావంతులైన నటీనటులు రొటీన్ కథలకు 'నో' చెప్పడం నేర్చుకోవాలి' అంటున్నారు బాలీవుడ్ భామ కంగనా రనౌత్. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికరమైన విషయాలను ఆమె వెల్లడించారు. 'నా యాటిట్యూడ్ కొందరికి ఇబ్బందిగా ఉంటుంది. నిర్మొహమాటంగా మాట్లాడటం. నచ్చని దాన్ని 'నచ్చలేదు' అని ముఖం మీదే చెప్పడం చాలామందికి నచ్చదు. కానీ నా ఉద్దేశ్యంలో 'నో' చెప్పడం చేతకాని వాళ్లు జీవితాన్ని గెలవలేరు. ఈ కారణంగా మనం టార్గెట్ అయినా.. దక్కాల్సిన అవకాశాలు మనకు దక్కకపోయినా.. చివరికి మాత్రం నిజాయితీనే గెలుస్తుంది. సంఖ్య అనేది ఎప్పటికీ ముఖ్యం కాదు. క్వాలిటీనే ముఖ్యం. మనం చేసిన పాత్రలు కొన్నేళ్లపాటు గుర్తుంటే, మనం ఆటోమేటిగ్గా గుర్తుంటాం. నచ్చని కథల్ని దూరం పెట్టాను కాబట్టే, నేను రెగ్యులర్ హీరోయిన్ల లిస్ట్‌లో లేను. అందుకు బాధ లేదు. నాకంటూ జనాల్లో ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. అది చాలు' అన్నారు కంగనా. ప్రస్తుతం ఆమె 'క్వీన్ 2'లో నటిస్తున్న విషయం తెలిసిందే.

# బెల్లంకొండ సాయి శ్రీనివాస్ మూవీ అరుదైన రికార్డు



టాలీవుడ్ యంగ్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తన కెరీర్‌లో అరుదైన డిజిటల్ మైలురాయిని అందుకున్నారు. పలువురు స్టార్ హీరోలకు కూడా సాధ్యం కాని ఘనతను ఆయన సొంతం చేసుకుని సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారారు. దర్శకుడు బోయపాటి శ్రీను తెరకెక్కించిన 2017 యాక్షన్ ఎంటర్‌టైనర్ 'జయ జానకి నాయక' హిందీ డబ్బింగ్ వెర్షన్ యూట్యూబ్‌లో ఏకంగా 1 బిలియన్ (100 కోట్ల) వ్యూస్ సాధించి సంచలనం సృష్టించింది. 'ఖుంఖార్' పేరుతో ప్రముఖ యూట్యూబ్ ఛానెల్‌లో విడుదలైన ఈ చిత్రం సంవత్సరాలు గడిచినా ప్రేక్షకాదరణను ఏమాత్రం కోల్పోలేదు. నెమ్మదిగా వ్యూస్ పెంచుకుంటూ వచ్చిన ఈ సినిమా ఇప్పుడు వంద కోట్ల వ్యూస్ మార్క్‌ను దాటడం విశేషం. దీంతో భారతీయ సినీ చరిత్రలో ఈ అరుదైన ఘనత సాధించిన చిత్రాల జాబితాలో చోటు దక్కించుకుంది. ఈ రికార్డుతో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ పేరు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. యూట్యూబ్‌లో ఒక ఫుల్ లెంగ్త్ డబ్బింగ్ సినిమాకు 1 బిలియన్ వ్యూస్ సాధించిన తొలి తెలుగు హీరోగా ఆయన నిలిచారు. టాలీవుడ్‌కు చెందిన అనేక బ్లాక్‌బస్టర్ చిత్రాలు హిందీలో డబ్ అయ్యి యూట్యూబ్‌లో విడుదలైనప్పటికీ, ఒక్క సినిమాతో ఈ స్థాయి వ్యూస్‌ను అందుకోవడం ప్రత్యేకమైన విజయంగా చెప్పవచ్చు. ఈ సినిమాలో రకుల్ ప్రీత్ సింగ్ హీరోయిన్‌గా నటించగా, జగపతిబాబు, శరత్ కుమార్ కీలక పాత్రలు పోషించారు. థియేటర్లలో డీసెంట్ హిట్‌గా నిలిచిన ఈ చిత్రం, డిజిటల్ ఎ÷-లాట్‌ఫామ్‌లలో మాత్రం అసాధారణ ఆదరణను దక్కించుకుంది.

# ఇరుముడి కట్టు లిరికల్ వీడియో విడుదల




మాస్ మహారాజా రవితేజ హీరోగా దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న డివోషనల్ థ్రిల్లర్ 'ఇరుముడి' సినిమాపై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ సినిమా నుంచి విడుదలైన తొలి పాట 'ఇరుముడి కట్టు' ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. అయ్యప్ప స్వామి భక్తి నేపథ్యంలో రూపొందిన ఈ గీతం భక్తి భావాలను మళ్లీ మళ్లీ గుర్తు చేసేలా ఉండటంతో సోషల్ మీడియాలో మంచి స్పందనను సొంతం చేసుకుంది. సోమవారం చిత్ర బృందం విడుదల చేసిన ఈ లిరికల్ వీడియోలో రవితేజ భక్తి పారవశ్యంలో మునిగిపోయిన తీరు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 'స్వామియే శరణం అయ్యప్ప' అంటూ ప్రారంభమయ్యే ఈ పాట, చివరి వరకు భక్తి రసాన్ని కొనసాగిస్తూ శ్రోతలను అలరిస్తోంది. పాటలో అయ్యప్ప మాలధారణలో కనిపించిన రవితేజ, భక్తి భావాలతో నిండిన స్టెప్పులు వేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఆయన లుక్, ఎక్స్‌ప్రెషన్స్, పాట చిత్రీకరణకు సంబంధించిన విజువల్స్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచాయి. విడుదలైన కొద్ది గంటల్లోనే ఈ పాట సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే సినిమాలో రెండు అయ్యప్ప స్వామి భక్తి గీతాలు ఉంటాయని ఆయన వెల్లడించారు. అందులో భాగంగా విడుదలైన తొలి పాటకు సంగీతం, ఆర్కెస్ట్రేషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ గీతాన్ని గాయకుడు అనంతు తన స్వరంతో అద్భుతంగా ఆలపించారు. పాట సాహిత్యాన్ని దర్శకుడు శివ నిర్వాణ, రచయిత కళ్యాణ్ చక్రవర్తితో కలిసి రాయడం విశేషం. 'ఇరుముడి' సినిమాలో భక్తి, భావోద్వేగాలు, థ్రిల్ అంశాలు సమపాళ్లలో ఉండనున్నాయని సమాచారం. ఫస్ట్ సాంగ్‌కు వస్తోన్న స్పందనను చూస్తుంటే సినిమా సంగీతం కూడా ప్రధాన ఆకర్షణగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి.


Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, PRGI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365